నవతెలంగాణ
నిజామాబాద్-కామారెడ్డి
మంగళవారం 09 మే 2023

ట్రాక్టర్ నడిపిన ఎంపీటీసీ



ట్రాక్టర్ నడుపుతున్న ఎంపీటీసీ

నవతెలంగాణ-ఏర్గట్ల

తమ న్యాయపరమైన డిమాండ్లు పరిష్కరించాలని గ్రామపంచాయతీ కార్మికులు గత నాలుగు రోజులుగా సమ్మెలో ఉండడంతో, గ్రామంలో జరిగే పారిశుద్ధ్య పనులు, అభివృద్ధి పనులకు ఆటంకం కలుగకూడదని గుమ్మిర్యాల్ గ్రామంలో జరుగుతున్న ఉపాధిహామీ పనుల్లో భాగంగా ఎంపీటీసీ బొల్లి శంకర్ ట్రాక్టర్ నడిపి గ్రామంలో రోజు వారిగా జరిగే పనుల్లో తనవంతుగా కృషిచేశారు.

ప్రత్యేక కూలీలతో పారిశుధ్య పనులు



ప్రయివేటు సిబ్బందితో డ్రయినేజీల క్లీనింగ్

నవతెలంగాణ-ఏర్గట్ల

గ్రామపంచాయతీ కార్మికులు సమ్మెలో ఉండడంతో ఏర్గట్ల సర్పంచ్ గుల్లే లావణ్య గంగాధర్ గ్రామంలో గల పారిశుద్ధ్య పనులకు ఇబ్బందులు కలుగకూడదని ప్రత్యేక కూలీలను తెప్పించి పారిశుద్ధ్య పనులు చేయించారు. ఈ సందర్భంగా సర్పంచ్ గుల్లే లావణ్య మాట్లాడుతూ... గ్రామంలో రోజువారీగా జరిగే పనులకు ఇబ్బందులు కలుగకూడదని పనులు చేయించినట్లు తెలిపారు.

ధర్నా ఉంటే.. గేట్లు బంద్

- కలెక్టరేట్ గేట్‌లు మూసివేస్తున్న పోలీసులు
- ఇతర ఫిర్యాదు దారులకు ఇబ్బందులు
- మరోదారిలేక గంటల పాటు పడిగాపులు
- ప్రత్యామ్నాయంగా ఓ గేటు తెరిచి ఉంచాలని విన్నపాలు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



ధర్నా చేపట్టడంతో మూసివేసి ఉన్న గేట్లు

కలెక్టరేట్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణికి వినతులు ఇచ్చేందుకు జిల్లా నలుమూలల నుంచి ఫిర్యాదుదారులు వస్తుంటారు. వివిధ డిమాండ్‌ల పరిష్కారంపై పలువురు పెద్దఎత్తున వచ్చి ధర్నా చేపడుతుంటారు. ధర్నాల సందర్భంగా ఎలాంటి అవాంచనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు ముందస్తుగా కలెక్టరేట్ గేట్లను మూసివేస్తు న్నారు. గేట్లను పూర్తిగా మూసి వేస్తుండటంతో ఇతర ఫిర్యాదుదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. ధర్నా కంటే ముందు లోపలికి వెళ్లిన వారు అక్కడే ఉండిపోతుండగా.. బయట ఉన్న వారు ఫిర్యాదు చేసేందుకు వీలు లేకుండా బయటే ఉండిపోతున్నారు. అధికారులు ప్రత్యామ్నాయంగా మరో గేటు తెరిచి ఉంచాలని ప్రజలు కోరుతున్నారు.

తాజాగా సోమవారం వేల్పూర్ మండలం రామన్నపేట్ గ్రామానికి చెందిన పలువురు కలెక్టరేట్ ఎదుట పెద్దఎత్తున ధర్నా చేపట్టారు. దీంతో కలెక్టరేట్ కార్యాలయానికి ఉన్న ఇన్, అవుట్ గేట్లు రెండు పూర్తిగా మూసివేశారు. వాటి పక్కనే ఉన్న చిన్న గేటును సైతం మూసివేశారు. ధర్నా ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు కొనసాగింది. అయితే ధర్నా కంటే ముందు లోపలికి వెళ్లిన వారికి బయటకు వచ్చేందుకు అవకాశం లేకుండా పోయింది. దీంతో పాటు ఫిర్యాదు చేసేందుకు వెళ్లేందుకు అవకాశం లేక పలువురు బయటే ఉండిపోయారు. ఒక గేటును మూసి మరో గేటును తెరిచి ఉంచాలని ఫిర్యాదు దారులు కోరుతు న్నారు. రెండు గేట్లు మూసి వేసి ఉండటంతో వాహనాలు బారులు తీరాయి. సోమవారం ఎండలు ముదర డంతో ఫిర్యాదుదారులు ఇక్కట్లు పడ్డారు.



కలెక్టరేట్ లోపల నిలిచిన వాహనాలు

కలెక్టరేట్ కార్యాలయానికి వచ్చిన బాధితులు ధర్నా చేసుకోవడానికి ఒక గేటు వైపు అవకాశం కల్పించి మరో గేటును తెరిచి ఉంచితే కలెక్టరేట్ సముదాయంలోకి వెళ్లే అధికారులకు, ప్రజలకు, బాధితులకు ఇబ్బందులు కలగకుండా ద్విచక్ర వాహనాలను లోపలికి తీసుకు వెళ్లే విధంగా అవకాశం ఉంటుందని పేర్కొంటున్నారు.

డ్యూటీలో చేరకుంటే సర్వీస్ రద్దు

- జేపీఎస్‌లకు నేటి సాయంత్రం 5 గంటల వరకు గడువు విధించిన ప్రభుత్వం
- సందిగ్ధంలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు

నవతెలంగాణ-బోధన్



రిలే దీక్షలో బైటాయించి ప్లకార్డులు ప్రదర్శిస్తున్న జేపీఎస్‌లు

తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలంటూ ఏప్రిల్ 28 తేదీ నుండి సమ్మె చేపట్టిన జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు ప్రభుత్వం నోటీసులు జారీ చేసింది. నేటి(మంగళవారం) సాయంత్రం 5 గంటల లోగా విధుల్లో చేరకుంటే ఉద్యోగాల్లో నుంచి తొలగిస్తామని హెచ్చరికలు జారీ చేసింది.

జూనియర్ పంచాయతీ కార్యదర్శులు విధుల్లో చేరిన సందర్భంగా మూడేండ్ల పాటు ప్రొబేషన్ పీరియడ్ విధించిన ప్రభుత్వం.. తదనంతరం మరో ఏడాది పొడగించింది. ఈ ఏడాది ఏప్రిల్ 11తో నాలుగేండ్ల సర్వీస్ పూర్తి కావడంతో తమను రెగ్యూలర్ చేయాలని లేకుంటే ఏప్రిల్ 28 నుంచి సమ్మెలోకి వెళ్తామని సమ్మె నోటీసులు అందజేశారు. అయినా ప్రభుత్వం స్పందించకపో వడంతో జేపీఎస్‌లు సమ్మె బాట పట్టారు.

అయితే సమ్మె విరమించకపోతే తీవ్ర చర్యలుంటాయని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. విధుల్లో చేరిన సమయంలో నియమ నిబంధనలు, అగ్రిమెంట్‌ను ప్రస్తావించింది. జూనియర్ పంచాయతీ కార్యదర్శులు యూనియన్‌ను ఏర్పాటు చేయడం, సమ్మెలో కొనసాగడం చట్టవిరుద్ధంగా ప్రకటించింది. జూనియర్ పంచాయతీ కార్యదర్శులు తమ అగ్రిమెంట్ బాండ్‌ను ఉల్లంఘించి యూనియన్‌గా ఏర్పడి తమ సర్వీస్ క్రమబద్ధీకరణ డిమాండ్‌తో 2023 ఏప్రిల్ 28 నుండి సమ్మెకు దిగడం నిబంధనలను ఉల్లంఘిం చడంగా పేర్కొంది. గతంలో విధులలో చేరిన సంధర్భంలో జూనియర్ పంచా యతీ కార్యదర్శులు సంతకం చేసిన అగ్రిమెంట్ బాండ్ ప్రకారం "జూనియర్ పంచా యతీ కార్యదర్శిగా ఏ సేవా సంఘం/ సంస్థ/ అసోసి యేషన్‌లో చేరొద్దని గుర్తు చేసింది. అయితే, చివరి అవకాశంగా నేటి (మంగళవారం) సాయంత్ర 5 గంటల లోపు విధుల్లో చేరాలని, లేకుంటే ఉద్యోగాల్లో నుంచి తొలగిస్తామని స్పష్టంచేసింది.

నేడు జేపీఎస్‌ల సమావేశం

ప్రభుత్వం తీరుపై జేపీఎస్‌లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నాలుగేండ్ల ప్రొబేషన్ కాలం పూర్తయినందున తమను రెగ్యూలర్ చేయకపోగా.. ఉద్యోగాల్లో నుంచి తొలగిస్తామని నోటీసులు పంపడం పట్ల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇచ్చిన హామీ నిలబెట్టుకోకపోగా.. బెదిరింపులకు పాల్పడుతున్నట్టు పలువరు జేపీఎస్‌లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాగా నేడు జేపీఎస్‌లు సమావేశం నిర్వహించి నిర్ణయం తీసుకోనున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్‌లో కొంతమంది జూనియర్ పంచాయతీ కార్యదర్శులు విధులలో చేరడానికి ఆసక్తిగా ఉన్నా, మరి కొంతమంది సందిగ్ధంలో ఉన్నట్లు సమాచారం.

రిజిస్ట్రార్‌గా మళ్లీ యాదగిరి

- టీయూలో విధుల్లో చేరిక



రిజిస్ట్రార్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న ప్రొఫెసర్ యాదగిరి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ యాదగిరి సోమవారం విధుల్లో చేరారు. ఉన్నత విద్యాశాఖ, తెలంగాణ యూనివర్సిటీ పాలకమండలి ఆదేశాల మేరకే తెలంగాణ యూనివర్సిటీ రిజిస్ట్రార్ గా తిరిగి విధుల్లో చేరినట్లు తెలిపారు. ఇటీవల యూనివర్సిటీ లో చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో పాలకమండలి ఆమోదంతో రెండేళ్ల పాటు రిజిస్ట్రార్‌గా నియమితులై సోమవారం పాలకమండలి సభ్యుల ఆమోదంతో విధుల్లో చేరారు. పాలకమండలి తీసుకున్న నిర్ణయాలకు అనుగుణంగా యూనివర్సిటీని అభివృద్ధి పథంలో తీసుకెళ్లేందుకు ముందుంటా నన్నారు. ముఖ్యంగా పోటీ పరీక్షల నేపథ్యంలో విద్యార్థులకు కావాల్సిన వసతుల ఏర్పాటు, లైబ్రెరీలో పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలను అందుబాటులో ఉంచుతామన్నారు. ఈనెల 12న హైదరాబాద్ లోని రూసా భవనంలో జరిగే పాలకమండలి సమావేశానికి తెలంగాణ యూనివర్సిటీకి కావాల్సిన అన్ని వసతులను పాలకమండలి నుంచి ఆమోదం తీసుకోనున్నట్టు తెలిపారు. యూనివర్సిటీలో పనిచేస్తున్న ప్రతి ఒక్కరూ విశ్వవిద్యాలయ అభివృద్ధికి సహకరించాలని సూచించారు. విధుల్లో చేరిన రిజిస్ట్రార్‌కు పాలకమండలి సభ్యులు వసుంధ రాదేవి, గంగాధర్ గౌడ్, ప్రొఫెసర్ డాక్టర్ నసీం, యూనివర్సిటీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆరతి, రవీందర్ రెడ్డి, మారయ్యగౌడ్‌లు శుభాకాంక్షలు తెలిపారు.

రేషన్ షాపుల్లో సన్నబియ్యం ఇవ్వాలి

- సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు సురేష్‌గొండ



మాట్లాడుతున్న సురేశ్‌గొండ

నవతెలంగాణ-జుక్కల్

రేషన్ దుకాణాల్లో సన్నబియ్యం పంపిణీ చేయాలని, బియ్యంతో పాటు 12 రకాల నిత్యావసర వస్తువులు అందజేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు సురేశ్‌గొండ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. రేషన్ దుకాణం ద్వారా పేద మధ్య తరగతి ప్రజలకు పది కేజీల సన్నబియ్యం ఉచితంగా పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. దొడ్డు బియ్యం మక్కి పోయినవి వస్తున్నాయని, అవి తినేటట్టు లేవని అన్నారు. ప్రజలకు ఉపయోగపడేలా సన్నరకం బియ్యం నాణ్యమైనవి సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరగడంతో ప్రజల కొనుగోలు శక్తి క్షీణించిందని, కావున రేషన్ దుకాణాల ద్వారా 12 రకాల వస్తువులు అందజేయాలని డిమాండ్ చేశారు. పది కిలోల సన్న బియ్యంతో పాటు వంటనూనే, కందిపప్పు, పెసర పప్పు, టీపొడి, పంచదారా, గోదుమ పిండి, పసుపు, చింతపండు, కారం, పల్లిలు, సబ్బులు రేషన్ షాపుల ద్వారా ఉచితంగా ఇవ్వాల్సిన అవసరం ఎంతైన ఉందని అన్నారు. ఇటీవలి కాలంలో గ్యాస్ పైన రాయితీ ఎత్తివేయడంతో గ్యాస్ ధరలు విపరీతంగా పెరిగాయని, గ్యాస్ పైన రాయితీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, అడెప్పా, మోతిరామ్ నాయక్, సచిన్, తదితరులు పాల్గొన్నారు.

వీడీసీలకు చట్టబద్ధత లేదు

- జరిమానాలు, బహిష్కరణ చేసే అధికారం ఎవరిచ్చారు..?
- రాజ్యాంగం కల్పించిన హక్కులకు భంగం కలిగించొద్దు
- జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్ పర్సన్ సునీత కుంచాల వ్యాఖ్యలు
- గ్రామ అభివృద్ధికి పాటుపడాలని సూచన

నవతెలంగాణ-డిచ్‌పల్లి



మాట్లాడుతున్న జిల్లా జడ్జి కుంచాల సునీత

వీడీసీ (గ్రామ అభివృద్ధి కమిటీ)లకు చట్టబద్ధత లేదని, హద్దులు దాటి రాజ్యాంగం కల్పించిన హక్కులకు భంగం కలిగించే విధంగా చేయొద్దని, వీడీసీ అంటే గ్రామ అభివృద్ధికి పాటుపడాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్ పర్సన్ సునీత కుంచాల సూచించారు. జరిమానాలు విధించడం, గ్రామ బహిష్కరణ చేసే అధికారం ఎవరిచ్చారని ప్రశ్నించారు. సోమవారం డిచ్‌పల్లి మండలంలోని లింగ సముద్రం గ్రామ పంచాయతీ కార్యాలయంలో అగ్రి లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను ప్రారంభించిన అనంతరం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.

గ్రామ అభివృద్ధి కమిటీలు చట్టవిరుద్ధంగా వ్యవహరించారాదని, చట్టపరిదిలో పనిచేయాలని చట్టానికి అనుకూలంగా విధులు నిర్వహిస్తే సహకరి స్తామని, చట్టవ్యతిరేకమైన చర్యలకు పాల్పడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవలసి ఉంటుందని స్పష్టంచేశారు. కొన్ని గ్రామ అభివృద్ధి కమిటీలు చట్టవ్యతిరేకమైన తీర్మానాలు చేసుకోని మా మాట వినని వారి కులాలను సామాజిక బహిష్కరణ చేసిన తీరు రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం హైకోర్టు విచారణలో ఉన్నదని తెలిపారు. గ్రామ అభివృద్ధి కమిటీల పనివిధానంలో మార్పు రావలసిన అవ సరం ఉన్నదని లేకుంటే చట్టం అనే ఆయుధం చాలా బలమైనదనే విషయాన్ని మరువరాదని ఆమె గుర్తు చేశారు.

రైతులతో న్యాయ చైతన్యం తీసుకురావడానికి అగ్రి లీగల్ ఎయిడ్ క్లినిక్ లను ఏర్పాటు చేస్తున్నా మని, రైతులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. చట్టాల గురించి తెలుసు కుంటే ఫలితాలు చాలా తీయదనాన్ని ఇస్తాయ న్నారు. పొలాల్లో కల్లాలు ఏర్పాటు శ్రేయస్కారమని, రహదారిపై ధాన్యాల ఆరబోత ప్రమాదకరమని, అది ప్రమాదా లకు హేతువు అవుతున్నదని వివరించారు. ప్రమాదా లకు కారణమైన వారు చట్ట ప్రకారం శిక్షార్హులు అవుతారని తెలిపారు. తల్లిదండ్రుల ఆలనాపాలనా వారి సంతానమే చూసుకోవా లన్నారు. మైనర్ బాలలు మోటారు వాహనాలు నడపడం నేరమని ఒక వేళ మోటారు వాహన ప్రమాదం అయితే దానికి మోటారు యజమాని లేదా వారి తల్లిదండ్రులే భాధ్యులవుతరని పేర్కొన్నారు.

నిజామాబాద్ ఏసీపీ కిరణ్ కుమార్ మాట్లాడుతు సంఘాలుగా ఉండటం తప్పు కాదని, కాని దాని ముసుగులో చట్ట వ్యతిరే కమైన చర్యలను సహించ బో మని హెచ్చరిం చారు. కొన్ని గ్రామ అభివృద్ధి కమిటీ లు సమాంతర ప్రభుత్వాలుగా చెలామణి అవుతున్న విషయం పోలీస్ శాఖ దృష్టికి వచ్చిందని దానిని ఎట్టి పరిస్థితుల్లో కొనసాగనివ్వ బోమని అన్నారు. ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నదని వాటిని అమలు చేసుకుని గ్రామాల అభివృద్ధికి వినియోగించు కోవాలని కోరారు.

జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి పద్మావతి మాట్లాడుతూ గ్రామస్తులందరు కలిసికట్టుగా ఉండాలని ఒకరిపై మరొకరు పెత్తనం చేలాయించడం, వివక్షను చూపడం, చట్ట విరుద్ధంగా వ్యవహరించడం చేయారాదని అన్నారు. ఈ సదస్సులో డిచ్‌పల్లి తహశీల్దార్ శ్రీనివాస్ రావు, ఎంపీడీవో గోపి బాబు, లింగ సముద్రం సర్పంచ్ వినోద, డిచ్‌పల్లి సీఐ కృష్ణ, నిజామాబాద్ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు ఆశ నారాయణ, న్యాయసేవ సంస్థ సూపరింటెండెంట్ పురుషోత్తం గౌడ్, ఎస్ఐ కచ్చాకాయల గణేష్, ఉప సర్పంచ్ ఓడ్డెన్న,అగ్రి లీగల్ ఎయిడ్ క్లినిక్ న్యాయ విద్యార్థి నరేంద్ర నాథ్, తదితరులు పాల్గొన్నారు.

ముందుగానే నాట్లు వేసుకోండి

- పంటమార్పిడి మరింత మేలు
- స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి
- ప్రతి ఇంటికీ 100 లీటర్‌ల భగీరథ నీరు చేరాలని సూచన

నవతెలంగాణ-చందూర్(వర్ని)/నసురుల్లాబాద్



సమావేశంలో మాట్లాడుతున్న స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి

నీరు ఉన్న చోట రైతులు ముందుగానే నాట్లు వేసుకుంటే ముందుగానే పంటలు కోతకు వచ్చి అకాల వర్షాలతో నష్టం వాటిల్లే అవకాశం ఉండబోదని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. పంట మార్పిడి చేయాలని, అప్పుడే దిగుబడులు పెరుగుతాయని తెలిపారు. అకాల వర్షాలకు పంటలు దెబ్బ తినకుండా ముందుగానే పంట వేసి కోతలు కోయాలని సూచించారు. సోమవారం చందూర్ మండల సర్వసభ్య సమవేశం ఎంపిపి లావణ్య రాంరెడ్డి అధ్యక్షతన కొనసాగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా స్పీకర్ హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా వివిధ శాఖల పనితీరుపై మాట్లాడారు. పంట చేలకు నీరు సాఫీగా పోయేలా కెనాల్‌లను, చెరువుల తూములను శుభ్రం చేయించాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. నీటిని వృథా చేయొద్దని ఆదేశించారు.

గ్రామా లల్లో ప్రజలకు ఇంటింటికీ 100 లీటర్ల తాగు నీరు అందేలా సర్పంచులు చొరవ చూపాలని చెప్పారు. మైనర్ రిపేర్‌లకు మిషన్ భగీరథ అధికారులు త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. భగీరథ నీరు ప్రజలు తాగేలా సర్పంచులు బాధ్యత తీసుకోవాలని రోజుకు రెండు సార్లు నీళ్ల అందేలా చూడాలని సూచించారు. అభివృద్ధి పనులకు టెండర్ పూర్తయినా పనులు చేపట్టకపోతే టెండర్ రద్దు చేయాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అమలు చేస్తున్న సంక్షేమ పథకా లను ప్రజాప్రతినిధులే వివరించాలని చెప్పారు. రైతులకు రైతు బీమా 9 మందికి, రైతు బంధు రూ.26 కోట్లు చందూర్ మండలంలో ఐదు గ్రామాల రైతులకు కలిపి అందజేసినట్టు వ్యవసాయ మండల అధికారి నగేష్‌రెడ్డి తెలిపారు. సమావేశం అనంతరం స్పీకర్‌ను ఎంపీపీ సన్మానించారు. అనం తరం గ్రామంలో షాదీఖానా, చందూర్ ఎత్తిపోతల పథకాలను ప్రారంభించారు. ఎంపిపి లావణ్య రాంరెడ్డి, ఎఎంసి చైర్మన్ మూడ్ కవిత అంబర్ సింగ్, పిఎసిఎస్ చైర్మన్ అశోక్, ఆర్‌డీవో రాజేశ్వర్, ఎంపీడీఓ నీలావతి, తహసీల్దార్ వసంత, సిపి కిరణ్ కుమార్, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

నసురుల్లాబాద్ : ప్రజారోగ్య పరిరక్షణే నా ధ్యేయమని స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. బాన్సువాడ పట్టణంలోని బాన్సువాడ ప్రాంతీయ ఆసుపత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన మానసిక ఆరోగ్య కేంద్రం, వయోవృద్ధుల ఫిజియోథెరఫీ కేంద్రాలను స్పీకర్ సోమవారం ప్రారంభించారు. అనంతరం స్పీకర్ మాట్లాడుతూ, బాన్సువాడ ఏరియా ఆస్పత్రిలో మానసిక ఆరోగ్య కేంద్రంతో పాటు వయోవృద్ధుల ఫిజియోథెరపీ మంజూరు చేసిన ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు.

మా జీతాలు చెల్లించండి

- టీయూలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల ధర్నా



ధర్నా చేపట్టిన ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు

వివరాలు మెయిన్‌లో..

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఏప్రిల్ నెల వేతనాలు తమకు రాకపోవడంతో ఈఎంఐలు కట్టలేకపోతున్నామని, ఇంటి అద్దెలు, ఇతరాత్ర ఖర్చులకు డబ్బులు లేవని ఔట్‌సోర్సింగ్ సిబ్బంది వాపోయారు. రాజకీయాలతో పంతాలకు పోవడంతో తమ వేతనాలు నిలిచాయని, వెంటనే తమకు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. డిచ్‌పల్లిలోని తెలంగాణ యూనివర్సిటీలోని పరిపాలన భవనం ఎదుట 276 మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు సోమవారం ధర్నా చేపట్టారు.

కలెక్టరేట్‌లో ఫస్ట్ ఎయిడ్ సెంటర్

నవతెలంగాణ కథనానికి స్పందన




ఫస్ట్ ఎయిడ్ సెంటర్‌లో వైద్య సిబ్బంది

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

ప్రతి సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుండి వచ్చే బాధితులకు ప్రజావాణిలో అనుకోకుండా ఏమైనా అనారోగ్య సమస్య ఏర్పడినా తక్షణ వైద్య సాయం అందించేందుకు వైద్య సిబ్బంది అందుబాటులో లేకపోవడంపై నవతెలంగాణలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. సోమవారం కలెక్టరేట్ సముదాయంలో ఫస్ట్ ఎయిడ్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ చంద్రశేఖర్ కాలని కి చెందిన డాక్టర్ జాహ్నవి, సూపర్వైజర్ మండోదరితో ఫస్ట్ ఎయిడ్ సెంటర్ ని కలెక్టరేట్ సముదాయంలో అందుబాటులో ఉండే విధంగా ఏర్పాటు చేశారు.

ప్రజావాణికి 80 వినతులు



వినతులు స్వీకరిస్తున్న అధికారులు

ప్రజావాణి పెండింగ్ దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 80 వినతులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి కలెక్టరేటుకు తరలివచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ తో పాటు ఆదనపు కలెక్టర్లు చిత్రామిశ్రా, చంద్రశేఖర్, జిల్లా పరిషత్ సీ ఈ ఓ గోవింద్, డీపీఓ జయసుధలకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, ప్రజావాణి అర్జీలను వెంటదివెంట పరిష్కరించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ప్రజావాణి వినతులపై తీసుకున్న చర్యల గురించి ఫిర్యాదుదారులకు సమాచారం తెలియజేస్తూ, ప్రజావాణి సైట్‌లో వివరాలు అప్లోడ్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మజ్దూర్ యూనియన్ జనరల్ సెక్రెటరీగా వేల్పూర్ మండల వాసి



నవతెలంగాణ-వేల్పూర్

మజ్దూర్ యూనియన్ జోనల్ కమిటీ జనరల్ సెక్రటరీగా వేల్పూర్ మండల వాసి సంజీవయ్య ఎన్నికయ్యారు. దక్షిణ మధ్య రైల్వే జోనల్ డివిజన్ కమిటీ సికింద్రాబాద్-విజయవాడ డివిజన్ అసిస్టెంట్ జనరల్ సెక్రటరీగా వేల్పూర్ మండలం జాన్కంపేట్ గ్రామవాసి తలారి సంజీవయ్య ఎన్నికయ్యారు. సోమవారం హైదరాబాదులో జరిగిన జనరల్ బాడీ సమావేశంలో సంజీవయ్య ఎన్నికైనట్లు ఆయన మిత్రుడు ఎల్ఎఫ్ఎస్ ప్రధానోపాధ్యాయుడు జంగం అశోక్ తెలిపారు సంజీవయ్య సికింద్రాబాద్ లోని రైలు నిలయంలో సీనియర్ అసిస్టెంట్ గా విధులు నిర్వహిస్తున్నారు. తలారి సంజీవయ్య బాల్ బ్యాడ్మింటన్ అంతర్జాతీయ వికలాంగుల క్రీడాకారుడు కావడం విశేషం.

మొక్కలను సంరక్షించాలి

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని బషీరాబాద్ గ్రామంలోని బిటి రోడ్డు వెంట ఎవెన్యూ ప్లాంటేషన్ లో భాగంగా నాటిన మొక్కలను సంరక్షించాలని సర్పంచ్ సక్కరం అశోక్ అన్నారు. సోమవారం ఆయన మొక్కలను పరిశీలించి మాట్లాడారు. ఎండలు ఎక్కువ అయినందున మొక్కలు చనిపోకుండా జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో నీటిని అందించి మొక్కలను కాపాడాలన్నారు. ఎక్కడైనా మొక్క చనిపోతే పాటి స్థానంలో వెంటనే మరో మొక్కను నాటి రీప్లేస్ చేయాలని సూచించారు. రోడ్డు వెంట నాటిన మొక్కల సంరక్షణకు ప్రజలు సహకరించాలని కోరారు. పంటల నూర్పిళ్లు చేసినప్పుడు వచ్చే చెత్తను మొక్కలపై వేసి కాల్చొద్దని కోరారు. మొక్కలకు నష్టం కలిగిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంటపంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

వీవోఏల డిమాండ్లు నెరవేర్చాలి

- వీవోఏల సమ్మెకు కాంగ్రెస్, డీఎస్పీ నాయకుల సంఘీభావం

నవతెలంగాణ-విలేకరులు

ధర్పల్లి:పొదుపు సంఘాలు సక్రమంగా కొనసాగుతుందంటే వివోల శ్రమ ఏంతో దాగి ఉందని దళిత ధర్మ సమాజ్ పార్టీ మండల అధ్యక్షుడు ప్రశాంత్ మహారాజ్ అన్నారు. ప్రభుత్వ పథకాల అమలుతోపాటు అధికారులకు , ప్రజలకు చేదోడుగా ఉండే వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండలం లోని వీఓలు ,ధర్మ సమాజ్ పార్టీ నాయకులు పాల్గొన్నారు,

నవీపేట్:గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థలో పనిచేస్తున్న వివోఏలు ఎంపీపీ సంగెం శ్రీనివాస్‌కు వినతి పత్రం అందించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సెర్ప్ శాఖ ద్వారా 20ఏండ్లుగా ప్రభుత్వ పథకాలను గ్రామీణ ప్రజలకు అందించడంలో కీలక పాత్ర వహిస్తూ చాలీచాలని జీతాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఉద్యోగ భద్రత, ప్రమోషన్, ప్రమాద బీమా కల్పించేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తామని ఎంపీపీ శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు బుచ్చన్న వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మహిళా సంఘ అధ్యక్షురాలు ఉషారాణి, నాగమణి, వినోద, స్రవంతి, రమతార, అరుణ, సవిత, నరేందర్ పాల్గొన్నారు.

సిరికొండ:మండల కేంద్రంలోని స్త్రీ శక్తి భవనం వద్ద నిర్వహిస్తున్న వివోఏల నిరవధిక సమ్మెలో ఆటపాటలతో వినూత్న ప్రదర్శన చేశారు. చిన్నారి ప్లకార్డ్ పట్టుకుని వివోఏల కనీస వేతనం 18 వేలు ప్రభుత్వం చెల్లించాలని నిరసన తెలిపింది. కార్యక్రమంలో అధ్యక్షుడు మూన్ సింగ్ ,వర్కింగ్ ప్రెసిడెంట్ స్వామి, రాకేష్, కవిత, భాగ్యలక్ష్మి, శ్యామల, ఫౌజియా బేగం రామ్ చందర్, రాజేశ్వర్ పాల్గొన్నారు.

ఆర్మూర్ :న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని ఉమ్మడి నిజామాబాద్ జిల్లా బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు అబ్బగోని అశోక్ గౌడ్ అన్నారు .పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద నిర్వహిస్తున్న వారి సమ్మెకు సోమవారం మద్దతు తెలిపి మాట్లాడారు. నెలకు 3900 రూపాయలు మాత్రమే జీతం ఇచ్చి వెట్టిచాకిరి చేయించడం సరికాదని, బ్యాంకు లోన్లు సంఘాల మహిళ గ్రూపుల టార్గెట్లు అయితేనే జీతం పడుతుందని అన్నారు. వారికి వెంటనే టార్గెట్లు తీసివేయాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు, దాసర మూర్తి, నారా గౌడ్, శ్రావణ్ పాల్గొన్నారు.

డిచ్‌పల్లి:ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేయించడంలో అహర్నిశలు శ్రమిస్తున్నామని ఇప్పటికైనా ముఖ్యమంత్రి కెసిఆర్ సానుకూలంగా స్పందించి సమస్యలు పరిష్కరించండి మహాప్రభో అని ఐకేపీ వివోఏ ఇందల్ వాయి మండల అధ్యక్షురాలు కె సరళ, ప్రధాన కార్యదర్శి కె రాము అన్నారు.సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చి నేటికీ నేరవేరలేదని వారు వాపోయారు. వీవోఏలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని కోరారు.అర్హులైన వారందరికీ సీసీలుగా నియమించాలని, యూనిఫామ్ కేటాయించాలని, ప్రమాద బీమా సౌకర్యం రూ. 10 లక్షల కల్పించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ సౌకర్యం కల్పించాలని వారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు సువర్ణ, కోశాధికారి మమత, సభ్యులు కవిత, సౌమ్య, అరుణ, స్వప్న, అలేఖ్య రాధికా, లావణ్య భాగ్య, మౌనిక తోపాటు తదితరులు పాల్గొన్నారు.



సిరికొండలో..



కమ్మర్‌పల్లిలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

కమ్మర్‌పల్లి :వీవోఏల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే నెరవేర్చాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సుంకేట రవి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఐకేపీ విఓఏ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరవధిక సమ్మెకు సంఘీభావం తెలిపి మాట్లాడారు. వివోఏలకు తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు నుండి రూ. 3900 మాత్రమే వేతనం చెల్లిస్తున్నారన్నారు. ఎన్నికల సమయంలో ఐకేపీ కార్మికులకు నెలకు రూ.10వేల కనీస వేతనం చెల్లిస్తామని, పసుపు, అల్లం కొమ్ములను ఐకేపీ సెంటర్‌ల ద్వారానే కొనుగోలు చేయిస్తామని ముఖ్యమంత్రి కేసీఆర్ మాటలు చెప్పి మోసం చేశారన్నారు. ప్రభుత్వానికి బ్యాంకులకు మధ్య ప్రధాన అనుసంధాన కర్తలుగా ఉండేది ఐకేపీ వివోఏలేనని అన్నారు. వీవోఏలకుకనీసం వేతనం రూ.18వేలు చెల్లిస్తూ, నేరుగా డిఆర్ డిఏ ఖాతా నుండి వివోఏల ఖాతాలో జమ చేయాలనీ డిమాండ్ చేశారు. అదేవిధంగా రూ. 10 లక్షల రూపాయల సాధారణ భీమా వర్తింపచేసి ఆదుకోవాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా క్రమబద్ధికరించాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పిరెడ్డి శ్రీనివాస్, కార్యదర్శి తక్కురి దేవేందర్, కమ్మర్ పల్లి పట్టణ అధ్యక్షులు బుచ్చి మల్లయ్య నాయకులు నిమ్మ రాజేంద్రప్రసాద్, ఉట్నూరు ప్రదీప్, సుంకేట శ్రీనివాస్, నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

సమ్మెకు సీపీఐ(ఎం) మద్దతు

నవతెలంగాణ-నవీపేట్

మండల కేంద్రంలో నిర్వహిస్తున్న గ్రామపంచాయతీ కారోబార్, సిబ్బంది, వీఎలేల సమ్మెకు సిపిఐ(ఎం) పార్టీ నిజామాబాద్ జిల్లా కార్యదర్శి రమేష్ బాబు సోమవారం మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివోఏలు 15 రోజులుగా న్యాయమైన డిమాండ్లతో సమ్మె చేస్తున్నారని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి వారి డిమాండ్లను పరిష్కరించాలని అన్నారు. అలాగే గ్రామపంచాయతీ కారోబార్, సిబ్బంది నాలుగు రోజులుగా చేస్తున్న సమ్మె డిమాండ్లను ప్రభుత్వం స్పందించి పరిష్కరించాలని కోరారు. సిపిఎం పార్టీ తరపున పూర్తి మద్దతు తెలుపుతున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి నాయక్ వాడి శ్రీనివాస్, తెలంగాణ రైతు సంఘం ఉపాధ్యక్షులు దేవేందర్ సింగ్ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న రమేష్‌బాబు

దివ్యాంగులకు ఉచిత బస్‌పాస్ క్యాంప్

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని దివ్యాంగులకు ఉచిత బస్సు పాస్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు ఐకెపిఎపిఎమ్ రవీందర్ రెడ్డి సోమవారం తెలిపారు. ఈనెల 9న దివ్యాంగులకు ఉచిత బస్ పాస్ క్యాంపు మండల కేంద్రంలోని శుభోదయం స్కూల్ దివ్యాంగుల పునరవాస కేంద్రంలో బస్సు పాస్ క్యాంపు నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. కావున దివ్యాంగులు సదరం సర్టిఫికెట్ జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్, రెండు ఫోటోలు వెంట తీసుకు రావాలని తెలియజేశారు.

హెల్త్ క్యాంప్‌ను సందర్శించిన మంత్రి వేముల



హెల్త్‌క్యాంపల్‌లో పాల్గొన్న మంత్రి ప్రశాంత్‌రెడ్డి

నవతెలంగాణ-వేల్పూర్

ఆర్మూర్ సుశ్రీత హాస్పిటల్ వైద్యులయిన మోర్తాడ్ మండల కేంద్రానికి చెందిన గణేష్ రెడ్డి(పీడియాట్రిషియన్) మౌనిక రెడ్డి ఎంబీబీఎస్. మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ లో ఏర్పాటు చేసిన ఉచిత హెల్త్ క్యాంప్‌ని సందర్శించిన మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి సోమవారం సందర్శించారు. పేదవారికి మెరుగైన వైద్యం అందించడానికి ఒక మంచి ఉద్దేశ్యంతో ఉచిత క్యాంప్ ఏర్పాటు చేసిన వారిద్దరిని మంత్రి ఈ సందర్భంగా అభినందించారు.

షీటీం విధులపై అవగాహన

నవతెలంగాణ-ఆర్మూర్

తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళ గురుకుల డిగ్రీ కళాశాలలో సోమవారం షీ టీం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా షీ టీం డివిజనల్ ఎస్సై ఇంద్రకరణ్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థినులు, స్త్రీలు ఎదుర్కొంటున్న ఈవ్ టీజింగ్ పై వెంటనే స్పందించాలని తెలిపారు. కళాశాల విద్యార్థినులకు ఏమైనా సమస్యలు ఉంటే షీ టీం ను ఎలా సంప్రదించాలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో షీ టీం హెడ్ కానిస్టేబుల్ సుమతి, కళాశాల ప్రిన్సిపల్ ధనవేని, వైస్ ప్రిన్సిపాల్ సుమలత, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఉరేసుకొని వ్యక్తిఆత్మహత్య

నవతెలంగాణ-ధర్పల్లి

మండలంలోని రామడుగు ప్రాజెక్ట్ గ్రామానికి చెందిన వ్యక్తి జీవితంపై విరక్తి చెంది ఆదివారము తన పశువుల కొట్టంలో ఉరేసుకొని మృతి చెందినట్లు ఎస్ఐ వంశీ కృష్ణ రెడ్డి సోమవారం తెలిపారు. ఆలూరి గంగారెడ్డి (52) మద్యానికి బానిసై ప్రతిరోజు మద్యం మత్తులో తాను చనిపోతా అనేవాడని మృతుని భార్య తెలిపింది. భార్య ఆలూరి లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి శవాన్ని పోస్టు మార్టంకోసం ఆసుపత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పీయూసీ చైర్మన్ కలిసిన బార్ అసోసియేషన్ ప్రతినిధులు



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న బార్‌అసోషియేషన్ సభ్యులు

నవతెలంగాణ-ఆర్మూర్

పీయూసీ చైర్మన్, శాసనసభ్యుడు జీవన్ రెడ్డిని సోమవారం పట్టణ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పూల మొక్క శాలువాతో సన్మానించారు. నూతనంగా ఎన్నికైన బార్ అసోసియేషన్ పియుసి చెర్మెన్ జీవన్ రెడ్డి నీ కోర్టు బార్ అసోసియేషన్‌ను విచ్చేయలని కోరారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సరసం చిన్న రెడ్డి ఉపాధ్యక్షుడు సెరియల జగన్, ప్రధాన కార్యదర్శి ఐనారి అశోక్, సంయుక్త కార్యదర్శి జైడి మదుసుదన్ రెడ్డి, ట్రెజరర్ డి. అరుణ్ కుమార్, గ్రంథాలయ కార్యదర్శి తుమ్మ సుకేష్, సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

డీటీడబ్ల్యూవోకు ఎస్టిమేషన్ కాపీ అందజేత

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్



ఎస్టీమేషన్ కాపీని అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

మండలం లోని మల్కాపూర్ తాండ గ్రామ పంచాయతీ పరిధిలోగల సమస్యలపై ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ దృష్టికి తీసుకెళ్లగా అధికారులతో ఎమ్మెల్యే ఫోన్‌ద్వారా మాట్లాడి వారికి ఎస్టిమేషన్ కాపీలను పంపించారు. వాటిని సోమవారం నిజామాబాద్ కలెక్టర్ కార్యాలయంలో డిసిఓ, డిటిడబ్ల్యూకు అందజేశారు. 179,180 ఈ సర్వే నంబర్లు భూముల పట్టాల గురించి, గ్రామంలో పాతవి 40 డబుల్ ఇండ్ల నిర్మాణం పనుల పూర్తి చేయడం, మల్కాపూర్ తాండ మందిరం దగ్గర నుండి ముందరితాండ రింగ్ రోడ్డు, వెనుక తాండ జండా వరకు బీటి రోడ్డు నిర్మాణం రెన్యువల్ చేయుటకు రూ. 80 లక్షలతో ఎస్టిమేషన్ కాపీని డీటీడబ్ల్యూవోకు అందజేశారు. కార్యక్రమంలో మండల ఎంపీపీ బానోత్ అనూష ప్రేమ్ , సర్పంచ్ ప్రకాష్ నాయక్, మండల ఎస్టీసెల్ అధ్యక్షులు బానోత్ గోపాల్ నాయక్, మండల ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి వసంతరావు నాయక్, సంతోష్, బీమా తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని కాపాడండి



కలెక్టరేట్ ఎదు టధర్నా చేస్తున్న గ్రామస్తులు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

ప్రభుత్వ భూమిని కాపాడాలని రామన్నపేట్ గ్రామ ప్రజలు కోరారు. రామన్నపేట్ గ్రామస్తులు సోమవారం కలెక్టరేట్ కార్యాలయానికి తరలివచ్చి ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు మాట్లాడుతూ వేల్పూర్ మండలం రామన్నపేట్ గ్రామంలో సర్వే నెం.350లో ప్రభుత్వ భూమి ఉందని, ఇందులో ప్రతి సంవత్సరం పస్కరాజుల, గ్రామదేవతలను నిర్మించుకుని పండగను ఘనంగా జరుపుకుంటామని అన్నారు. దీనిపై గ్రామానికి చెందిన ముదిరాజ్ కులస్తులు పెత్తనం చెలాయిస్తున్నారని ఆరోపించారు. సమస్యను సామరస్యంగా పరిష్కరించుకుందామని, కూర్చొని మాట్లాడుకుందాం అని చెప్పిన వారు పట్టించుకోవడం లేదని అన్నారు. చట్టప్రకారంగా ఏమి చేయాలో ప్రభుత్వమే నిర్ణయించి వారిపైన చర్యలు తీసుకోవాలని కోరారు.

అర్ధరాత్రి వ్యక్తిపై విచక్షణారహితంగా దాడి

- రక్తపు మడుగులో ఉన్న వ్యక్తిని ఆసుపత్రికి తరలించిన స్థానికులు
- ఘటనపై దర్యాప్తు చేసిన పోలీసులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

అర్ధరాత్రి ఓ వ్యక్తిపై కొందరు దుండగులు బీరు బాటిళ్లు, రాళ్లతో విచక్షణా రహితంగా దాడికి పాల్పడ్డ ఘటన నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. బాధితుడు షకీల్ తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని ముస్తాక్ పుర కాలనీకి చెందిన షకీల్ ఆదివారం అర్ధరాత్రి రెండు గంటల సమయంలో పుట్టిన పార్టీ ఉందని ఇంట్లో చెప్పి బయటకు వచ్చాడు. అయితే ఆటోలో కొందరు వ్యక్తులు ఎక్కించుకొని సోనీ ఫంక్షన్ హాల్ వైపు తీసుకువెళ్లారు. అక్కడ కొందరు వ్యక్తులు విచక్షణ రహితంగా రాళ్లు, బీర్ బాటిళ్లతో దాడికి పాల్పడ్డారు. ఘటనలో షకీల్ మెడపై, చేతులపై, భుజంపై బీరు బాటిళ్లతో దాడికి పాల్పడి అక్కడి నుంచి పరారయ్యారు. అపస్మారక స్థితిలో రక్తపు మడుగులో పడి ఉన్న షకీల్ ని సోమవారం ఉదయం స్థానికులు గుర్తించి నాలుగవ టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న ఎస్ఐ తిరుపతి క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు. అయితే షకీల్ కారి తోపుడు బండి నడుపుతూ జీవనం కొనసాగిస్తున్నాడు. చిరు వ్యాపారం చేస్తూ జీవించే షకీల్‌పై ఇలా విచక్షణ రహితంగా దాడికి పాల్పడడం నగరంలో కలకలం లేపింది. షకీల్ ఎవరితో గొడవ పడేవాడు కాదని, ఎలాంటి శత్రుత్వం లేదని కుటుంబీకులు చెబుతున్నారు. ఇలా అకారణంగా నలుగురు వ్యక్తులు దాడికి పాల్పడ్డారని, వారిపై చర్యలు తీసుకోవాలని షకీల్ భార్య పోలీసులను కోరుతోంది. ప్రస్తుతం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.



తీవ్రంగా గాయపడ్డ షకీల్

కంటి శిబిరం సద్వినియోగం చేసుకోవాలి

- ఐడిసిఎంఎస్ చైర్మన్ సాంబరి మోహన్

నవతెలంగాణ-డిచ్‌పల్లి/జక్రాన్‌పల్లి

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమంను గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఐడిసిఎంఎస్ చైర్మన్ సాంబరి మోహన్, సర్పంచ్ నోముల విజయలక్ష్మి లక్ష్మారెడ్డి, వైస్ ఎంపిపి బుసని అంజయ్య అన్నారు. సోమవారం ఇందల్ వాయి మండలంలోని నల్లవెల్లి గ్రామపంచాయతీలో ఏర్పాటుచేసిన కంటి శిబిరాన్ని రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 18 సంవత్సరాల పై బడిన ప్రతి ఒక్కరికి కంటి పరీక్ష నిర్వహించడం జరుగుతుందని వివరించారు. ఆశా కార్యకర్తలు ఇంటింటికి తిరిగి కంటి సమస్యలతో బాధపడుతున్న వారిని గుర్తించి కంటి పరీక్ష ఉచిత శిబిరానికి తిసుకొని రావడానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ బాబు శరత్, ఎడ్ల శ్రీనివాస్, గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు మిద్దె నర్సయ్య, ఉపాధ్యక్షులు అవుసుల ధర్మ పురి, మాజీ విడిసి అధ్యక్షులు నిరేడి మనోహర్,రవి వైద్య బృందం, ఇందల్ వాయి మండల ఆరోగ్య విస్తరణ అధికారి వై శంకర్, సభ్యులు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి:మండలంలోని లక్ష్మాపూర్ గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చాలా నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని వైస్ ఎంపీపీ సభ్యులు ముస్కు తిరుపతి రెడ్డి సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ కైలాష్, ఉప సర్పంచ్ ఉమా సాయన్న, ఎంపీటీసీ సభ్యులు సాయన్న, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కంటి వెలుగు డాక్టర్లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు



డిచ్‌పల్లిలో కంటిపరీక్షలు చేస్తున్న వైద్యులు



జక్రాన్‌పల్లిలో..

కాంగ్రెస్ యూత్ సంఘర్షణ సభకు వెళ్లిన నాయకులు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

కాంగ్రెస్ యూత్ సంఘర్షణ సభకు నిజాంబాద్ రూరల్ విభజన విభాగం నాయకులు సోమవారం హైదరాబాద్ తరలి వెళ్లారు. కాంగ్రెస్ యూత్ సభకు. ముఖ్య అతిధులుగా. ప్రియాంక గాంధీ విచ్చేస్తున్నారని యువజన విభాగం మండల అధ్యక్షుడు వినోద్ తెలిపారు. కార్యక్రమంలో రూరల్ అధ్యక్షులు ఉమ్మజి నరేష్, నిజామాబాద్ మండలం అధ్యక్షులు సురేష్ స్టేట్ కోఆర్డినేటర్ నక్కల నవీన్ కుమార్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు బోగ జనార్ధన్ సీనియర్ కార్యకర్తలు తదితరులు ఉన్నారు.



సీఎం కేసీఆర్ రైతులను పట్టించుకోవడంలేదు

- అంబేద్కర్ చౌరస్తా వద్ద ధర్నా

నవతెలంగాణ-ఆర్మూర్

బిజెపి అసెంబ్లీ కన్వీనర్ పాలెపురాజు అధ్యక్షతన నియోజకవర్గ రైతుల సమ స్యలను, పరిష్కరించాలని కోరుతూ సోమవారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద రైతు మహాధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి మాట్లాడుతూ...తెలంగాణ రాష్ట్రంలో అకాల వర్షాలకు పంటలన్నీ నష్టపోయినా ముఖ్యమంత్రి కేసీఆర్ మాత్రం ఇవేమీ తనకు పట్టనట్లుగా బీఆర్ఎస్ పార్టీని వివిధ రాష్ట్రాల్లో అభివృద్ధి చేసేందుకు తెలంగాణ రాష్ట్రంలోని ధనాన్ని పక్క రాష్ట్రాల్లో పార్టీ అభివృద్ధికి వెచ్చించి "అబ్ కీ బార్ కిసాన్ సర్కార్" అనే నినాదంతో పర్యటిస్తున్నారని విమర్శించారు. పంటలు నష్టపోయి రైతులు లబోదిబో అంటుంటే తన కూతురి అవినీతి వ్యవహా రాలను చక్కదిద్దు కోవడానికై సమయాన్ని ధనాన్ని వృధా చేస్తున్నారని అన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు అవినీతిలో కూరుకపోవడంతో దానిపై ఉన్న శ్రద్ధ రైతుల పరిస్థితులను క్షేత్రస్థాయిలో అంచనా వేయడానికి వెళ్లలేదంటే బీఆర్ఎస్ ప్రభుత్వానికి రైతులపై ఉన్న శ్రద్ధ స్పష్టమవుతుందన్నారు. అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలకు ఎకరానికి 50 వేల చొప్పున నష్టపరహాన్ని ఇవ్వాలని, హామీప్రకారం రైతులకు లక్ష రూపాయలు రుణమాఫీ చేయాలని, వర్షాలకు తడిసిన ధాన్యాన్ని తరుగు లేకుండా కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని. రైస్ మిల్లులో సైతం తేమా, తాలు అనుకుంటూ తరుగు తీసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ వేణు గోపాల్‌గౌడ్‌కు రైతుల సమస్యలను, రైతాంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో జెస్సు అనిల్ కుమార్, నూతల శ్రీనివాస్ రెడ్డి, శివ రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ధర్నాల్లో కూర్చున్న నాయకులు

పేదలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వాలు పరిష్కరించాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేష్ బాబు

నవతెలంగాణ-నవీపేట్:



మాట్లాడుతున్న రమేష్‌బాబు

పేద ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే పరిష్కరించాలని సీపీఐ(ఎం) నిజామాబాద్ జిల్లా కార్యదర్శి రమేష్ బాబు అన్నారు. మండల కేంద్రంలోని సుందరయ్య కాలనీలో మంగళవారం నిర్వహించిన మేడే వారోత్సవాలలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు పేద ప్రజల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తున్నాయని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చి పూర్తిగా మరిచిపోయిందని ఎద్దేవా చేశారు. కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తూ నాలుగు లేబర్ కోడ్లను తీసుకు వచ్చిందన్నారు. నల్ల చట్టాలను తీసుకురావడంతో పోరాటాలు చేయడం ద్వారా వెనక్కు తగ్గిందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సైతం డబుల్ బెడ్ రూమ్, ఇంటి జాగా ఉన్న వారికి ఐదు లక్షల రుణం ఇవ్వాలని, కబ్జాలో ఉన్న వారికి జీవో నెంబర్ 58 ప్రకారం రెగ్యులర్ చేయాలని కోరారు. కార్మిక, కర్షక మైత్రి కొనసాగింపులో భాగంగానే మేడే వారోత్సవాలు నిర్వహించడం జరిగిందని అన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ కార్యదర్శి నాయక్ వాడి శ్రీనివాస్, దేవేందర్ సింగ్, షేక్ మహబూబ్, సావిత్రి, షమీం పేదలు పాల్గొన్నారు.

కూలిన ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ భవనం

- రూట్ వాచ్‌కు వెళ్లడంతో తృటిలో తప్పిన పెను ప్రమాదం

నవతెలంగాణ-కంఠేశ్వర్



కూలిపోయిన భవనం పైకప్పు

ఏళ్ల తరబడి శిధిలావస్థకు చేరుకున్న ప్రభుత్వ కార్యాలయాలను ప్రభుత్వం, జిల్లా పాలనయాత్రంగం సైతం పట్టించుకోక పోవడంతో తాజాగా ఆదివారం రాత్రి ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్ మెంట్ భవనం కూలిపోయింది. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని సుభాష్ నగర్ లోని రైతుబజార్ వద్ద గల ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ భవనం ఆదివారం కూలింది. శనివారం రాత్రి సిబ్బంది రూట్‌వాచ్‌కు వెళ్లడంతో విధులకు రాలేదు. ఈ సమయంలో భవనంలో సిబ్బంది లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. అక్కడే విధులు నిర్వహిస్తున్న ఎక్సైజ్ కానిస్టేబుల్ టీవీఎస్ ఎక్సెల్‌పై సిమెంట్ పెచ్చులు ఊడిపడడంతో వాహనం ధ్వంసమైంది. పెద్ద ప్రమాదమే తప్పిందని అధికారులు తెలిపారు.

బీసీ కాలనీలో డ్రైయినేజీ పనులు ప్రారంభం

నవతెలంగాణ-ధర్పల్లి

మండల కేంద్రములో బిసి కాలనిలో డ్రైనేజి పనులను ఎంపీపీ నల్ల సారిక హన్మంత్ రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ బీసీ కాలనీలోని డ్రైనేజి వ్యవస్థ బాగాలేదని తన దృష్టికి కాలనీవాసులు తేగా తన నిధులతో పనులు ప్రారంభించామని అన్నారు. మండలంలో సమస్యలు ఉన్న చోట సహకరించి నిధులు అడిగిన వెంటనే అందిస్తున్న రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, జెడ్పీటిసి బాజిరెడ్డి జగన్ మోహన్‌కు వారు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆర్మూర్ పెద్ద బల్ రాజ్, సొసైటీ చైర్మెన్ మల్లికార్జున్, ఎంపీడీఓ నటరాజ్, నాయకులు పుప్పాల సుభాష్, ఉప సర్పంచ్ రాణి, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం తనిఖీ

నవతెలంగాణ-పిట్లం



మండలంలోని కారేగాం సింగిల్ విండో ఆధ్వర్యంలో కొనసాగుతున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ రామ్మోహన్‌రావు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన కొనుగోలుపై ఆరా తీయగా.. 3 ట్రక్‌షీట్లు పూర్తి కాగా కుర్తి గ్రామ వైష్ణవి రైస్ మిల్లులో అన్‌లోడింగ్ వల్ల మూడు ట్రక్కుషీట్లు పెండింగ్‌లో ఉన్నట్టు విండో సిబ్బంది ఆయనకు తెలిపారు. కార్యక్రమంలో విండో సెక్రటరీ నరసింహరెడ్డి, కంప్యూటర్ ఆపరేటర్ ఎల్లయ్య, క్లర్కు మహిపాల్‌రెడ్డి రైతులు పాల్గొన్నారు.

నాలుగో రోజుకు పంచాయతీ సిబ్బంది సమ్మె

నవతెలంగాణ-ఎడపల్లి



మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం ఎదుట గ్రామపంచాయతీలో పనిచేస్తున్న కారోబార్లు, సిబ్బంది చేపట్టిన నిరవధిక సమ్మె 4వ రోజుకు చేరింది. తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం సమ్మె కొనసాగిస్తున్నట్టు వివరించారు. సమ్మెలో కారోబార్ల యూనియన్ ఎడపల్లి మండలాధ్యక్షులు రాజు, ఉపాధ్యక్షులు పాండు, కృష్ణ, గుణతేజ, లక్ష్మణ్, రహీమత్, వెంకగౌడ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పురుగులమందు తాగి వృద్ధుడు ఆత్మహత్య

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని మర్కల్ గ్రామానికి చెందిన దొడ్లే చిన్న రాజయ్య (78) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్టు పోలీసులు తెలిపారు. వారి వివరాల ప్రకారం... రాజయ్యకు షుగర్ వ్యాధి ఉండటం వలన పుండ్లు తగ్గకపోవడంతో మానసికంగా కుంగిపోయి ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి సోమవారం మృతిచెందాడు. భార్య కిష్టవ్వ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

లింగంపేట్‌లో ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవం

- రక్తదాన శిబిరం
- యువకులకు శాలువాలతో ఘనంగా సన్మానం



రక్తదానం చేస్తున్న యువకులు

నవతెలంగాణ-లింగంపేట్/జుక్కల్

రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో రక్తదాన శిబిరాన్ని సోమవారం నిర్వహించినట్టు రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షులు బొల్లు శ్రీకాంత్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన రక్తదాన శిబిరంలో 49వసారి రక్తదానం చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. రక్తదాన శిబిరంలో 36 యూనిట్ల రక్తాన్ని సేకరించినట్టు తెలిపారు. అదేవిధంగా రక్తదాన శిబిరంలో మొదటిసారి రక్తదానం చేసిన 17 మంది యువకులకు తహసీల్దార్ చంద్ర రాజేశ్వర్, ఎంపీడీవో మల్లికార్జున్‌రెడ్డి, ఐఆర్‌సీఎస్ జిల్లా బాడీ మెంబర్ చేతుల మీదుగా శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అఫ్రోజ్, బీజేపీ సీనియర్ నాయకులు ఎల్లమయ్య, బీఆర్ఎస్ టౌన్ యూత్ ప్రెసిడెంట్ సాదిక్, ఐకేపీ సీసీలు శ్రావణ్ గౌడ్, మెహర్, రంజిత్, సునీల్, ఉమేష్, శ్రీధర్, మణితేజ, సాయితేజ, అనిల్ పాల్గొన్నారు.

ఘనంగా రెడ్‌క్రాస్ ఆవిర్భావ దినోత్సవం

జుక్కల్ : మండలం కేంద్రంలో రెడ్‌క్రాస్ ఆవిర్భావ దినోత్సవాన్ని మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మెన్ డొంగ్లే ఉమాకాంత్ హెన్రి డోనేట్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఐఆర్‌సీఎస్ చైర్మెన్ ఉమాకాంత్ మాట్లాడుతూ.. రెడ్‌క్రాస్ అంటే ఒక భరోసా అని తెలిపారు. ప్రకృతి వైపరీత్యాలు, భూకంపాలు, అతివృష్టి, అనావృష్టి సమయంలో చిత్త శుద్ధితో, అంకిత భావంతో పని చేస్తుందని అన్నారు. ప్రపంచంలో 9.7లక్షల మంది సభ్యత్వం పొందిన వారు ఉన్నారని వివరించారు. కార్యక్రమంలో జిల్లా బాధ్యులు దస్తీరాం, ఐఆర్‌సీఎస్ సభ్యులు సోమావార్ సంతోష్, సరేష్, రాజు పటేల్, శైలేష్ తదితరులు పాల్గొన్నారు.

3వ రోజుకు చేరిన ఎమ్మార్పీఎస్ నాయకుల దీక్ష

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

దళితబంధు పథకంలో లబ్దిదారులకు జరిగిన అవినీతిని నిరసిస్తూ ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని తెలంగాణ తల్లి ప్రాంగణంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ పార్టీల ఆధ్వర్యంలో చేపట్టిన దీక్ష కార్యక్రమం సోమవారం 3వ రోజుకు చేరుకుంది. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ దళితబంధు పథకంలో అవినీతి ఎమ్మెల్యేలను వెంటనే సస్పెండ్ చేయాలని వారిపై చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో ప్రతిష్టమైన ప్రణాళికతో దీక్ష కార్యక్రమం కొనసాగిస్తామని హెచ్చరించారు. ముఖ్యమంత్రి అవినీతికి పాల్పడిన ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోకపోవడానికి చూస్తుంటే ముఖ్యమంత్రి అవినీతిని ప్రోత్సహిస్తున్నట్టేనని స్పష్టమవుతుందని అన్నారు. ముఖ్యమంత్రి నిజాయితీని నిరూపించుకోవాలంటే వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో గుండెనోళ్ల పెద్ద సాయిలు, బంగారుగల్ల యాదయ్య, గుండెనోల మానేయ, పోచయ్య, శివయ్య, ఏర్పుల మహేందర్, దుర్గయ్య, భూమిగారి లక్ష్మయ్య, రాజు, రామగళ్ళ పరువయ్య, మైసయ్య, బాలపోశయ్య, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

నవతెలంగాణ-ఎడపల్లి

మండల శివారు ప్రాంతంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని మహిళ అక్కడికక్కడే మృతి చెందినట్టు ఎడపల్లి పోలీసులు తెలిపారు. ఎస్ఐ పాండేరావు తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తు తెలియని మహిళ(35) కాలినడకన బోధన్ నుంచి ఎడపల్లికి వెళ్తుంది. ఈ క్రమంలో గుర్తుతెలియని వాహనం బలంగా ఢీకొనడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఆమె శరీరంపై బ్లూ, ఆరెంజ్ కలర్ దుస్తులు ఉన్నాయి. కాగా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

జీపీ నిధుల దుర్వినియోగంపై ప్రజావాణిలో ఫిర్యాదు

నవతెలంగాణ-సదాశివనగర్

ధర్మారావుపేట గ్రామ పంచాయతీలో జరిగిన నిధుల దుర్వినియోగంపై ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. గతంలో కూడా నిధుల దుర్వినియోగం జీపీ ట్రాక్టర్ సొంత పనులకు, గుత్తేదారు పనులకు వాడుతున్నారని, గ్రామ పంచాయితీ సిబ్బందిని సొంత పనులకు వాడుతున్నారని ఫిర్యాదు చేస్తే దీనిపై విచారణ నిమిత్తం ఎంపీఓ గ్రామ పంచాయతీ వద్ద గ్రామస్తుల అందరి సమక్షంలో విచారణ జరిపినప్పటికి ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు. శ్మశాన వాటిక నిర్మాణం కోసం గ్రామ పంచాయతీ నుంచి 3లక్షలకు పైగా తీసుకొని ఇప్పటికీ ఆ డబ్బులను గ్రామ పంచాయతీకి చెల్లించడం లేదని, హరితహారం పేరుతో పెట్టని మొక్కలకు కూడా పెట్టినట్టు నిధులు డ్రా చేశారని తెలిపారు. బోరు మోటర్‌కు ఎలాంటి రిపేర్ కానప్పటికీ రిపేర్ల పేరుతో అడ్డగోలుగా నిధుల దుర్వినియోగం చేస్తున్నారని వివరించారు. బోరుమోటర్ కొననప్పటికీ కొన్నట్టు తప్పుడు రశీదులు పెట్టి బిల్లు కాజేసుకున్నారని, వీటన్నింటిపై సమగ్ర విచారణ జరిపి నిధుల రికవరీ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

వివిధ పార్టీ నాయకులతో ఆర్డీవో సమావేశం

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఓటరు జాబితాపై ఆర్డీఓ శ్రీనునాయక్ ఎల్లారెడ్డి ఆర్డీఓ కార్యాలయంలో వివిధ పార్టీ నాయకులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ శ్రీను నాయక్ మాట్లాడుతూ.. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఫారం 6 నందు దరఖాస్తు చేసుకోవాలని ఓటరు ఎవరైనా పెండ్లై వేరేచోటుకు వెళ్తే ఫారం 8 ద్వారా మార్పు చేసుకోవాలని సూచించారు. స్పెషల్ సమ్మర్ రివిజన్‌లో భాగంగా గతంలో ఒక పర్యాయం మాత్రమే నిర్వహించామని, ప్రస్తుత జనవరి, ఆగస్టు, అక్టోబర్ మాసాలలో నాల్గవ పర్యాయాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. సమావేశంలో ఎల్లారెడ్డి నియోజకవర్గ పార్టీల అధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

క్రీడల్లో ప్రావీణ్యం సాధించాలి

- 15నుంచి 'సీఎం కప్ క్రీడాపోటీలు'
- పాల్గొనేవారు పేర్లను నమోదు చేసుకోవాలి
- సూచించిన ప్రజాప్రతినిధులు
- క్రీడాపోటీలపై పలుచోట్ల సమావేశాలు



దోమకొండ : మాట్లాడుతున్న ఎంపీపీ



జుక్కల్: మాట్లాడుతున్న ఎంపీపీ యశోద నీలుపటేల్

నవతెలంగాణ-విలేకరుల బృందం

దోమకొండ : యువత మండల స్థాయిలో నిర్వహించే ఆయాక్రీడల్లో ప్రావీణ్యం సాధించాలని ఎంపీపీ కానుగంటి శారద అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో సీఎం కప్ 2023 క్రీడపోటీల నిర్వహణ కోసం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ శారదా మాట్లాడుతూ.. ప్రభుత్వం ఆదేశాల మేరకు గ్రామీణ స్థాయిలో క్రీడాకారులను వెలికితీసి వారికి ప్రోత్సహం అందించేందుకు మండలంలో ఈనెల 15,16,17 తేదీలలో మండల కేంద్రంలో మండల స్థాయి క్రీడలను నిర్వహిస్తున్నామని గ్రామీణ క్రీడాకారులు, యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మండల స్థాయిలో రాణించిన క్రీడాకారులు తరువాత జిల్లాస్థాయిలో ఈ పోటీలో పాల్గొంటారని తెలిపారు. పోటీలలో అన్ని గ్రామాల నుంచి యువత టీంల వారీగా పాల్గొనేలా చూడాలన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ తిర్మల్‌గౌడ్, ఎంపీడీఓ చిన్నారెడ్డి, ఎంపీవో తిరుపతిరెడ్డి, సర్పంచ్‌లు నల్లపు అంజలి, సార్ల నర్సవ్వ, నాంపల్లి కోఆప్షన్ శమ్మి, ఏఎస్ఐ, పీఈటీలు తదితరులు పాల్గొన్నారు.

క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసేందుకే సీఎం కప్ క్రీడలు..

నసురుల్లాబాద్ : యువతలో దాగిఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసేందుకే ముఖ్యమంత్రి కప్పు పేరుతో మండలాల్లో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్టు నసురుల్లాబాద్ ఎంపీపీ పాల్త్య విఠల్ తెలిపారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ముఖ్యమంత్రి క్రీడా కప్ నిర్వహణపై అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆటల పోటీల్లో గెలుపోటములు సహజమని, ఓడినవారు భవిష్యత్‌లో మరిన్ని జాగ్రత్తలతో విజయం కోసం కృషి చేయాలన్నారు. క్రీడలతో యువతలో స్నేహభావం పెంపొందుతుందన్నారు. మండల స్థాయి క్రీడల పోటీలు ఈనెల 15 నుంచి 17 వరకు మండల కేంద్రంలో అన్ని క్రీడ మైదానంలో ఉదయం 7 గంటల నుంచి 12గంటల వరకు ఉంటుందని, ఈ ఆటలలో పాల్గొనే జట్లు 13వ తేదీ సాయంత్రం వరకు పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. ఈ క్రీడలలో గెలుపొందిన జట్లకు సర్టిఫికేట్, మెమోంటో ఇవ్వడంతో పాటు జిల్లా స్థాయికి పంపనున్నట్టు తెలిపారు.

జుక్కల్ : 15నుంచి సీఎం కప్ పోటీలు నిర్వహించనున్నటుట మండల ప్రజాపరిషత్ అధ్యక్షులు యశోద నీలుపటేల్ తెలిపారు.

ఎంపీపీ అధ్యక్షతన మండలంలోని మండల పరిషత్ కార్యాలయంలో సీఎం కప్ 2023 స్పోర్ట్స్ నిర్వహణకు సంబంధించి సమావేశం నిర్వహించారు. మండల స్థాయి పోటీలు ఈనెల 15వ తేదీ నుంచి 17వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. అథ్లెటిక్స్, కబడ్డీ, వాలీబాల్, ఖోఖో ఆటలు పోటీలు నిర్వహించనున్నట్టు వివరించారు. ఈ పోటీలలో పాల్గొనేవారు ఎంఈవో కార్యాలయం నందు ఈనెల 13వ తేదీలోగా టీం వివరాలు ఇవ్వాలని సూచించారు.

లింగంపేట్ : ఈనెల 15 నుంచి 17 వరకు మండల స్థాయిలో ముఖ్యమంత్రి 2023 కప్పు మండల క్రీడలు నిర్వహించనున్నట్టు మండల అభివృద్ధి అధికారి మల్లికార్జున్‌రెడ్డి తెలిపారు. సోమవారం మండల పరిషత్ కార్యాల యంలో మండల పరిషత్ అధ్యక్షురాలు గరిబున్నీసా నహీం అధ్యక్షతన మండల స్థాయి సమావేశం నిర్వహిం చారు. ఈనెల 8 నుంచి 12వ తేదీ వరకు మండలంలోని ఆయా గ్రామానికి చెందిన క్రీడాకారులు మండల పరిషత్ కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. 18 సంవత్సరాల నుంచి 36 సంవత్స రాలలోపు క్రీడాకా రులు తమ పేర్లను మండల పరిషత్ కార్యాలయంలో జట్టు వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. సమావేశంలో ఎమ్మార్వో చంద్రరాజేశ్వర్, ఎస్ఐ శంకర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిద్ధికి, పీఈటీ సంగారెడ్డి, ఆయా శాఖలకు చెందిన అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



లింగంపేట్ : మాట్లాడుతున్న ఎంపీడీవో

రామారెడ్డి : మండల స్థాయి సీఎం కప్ సమ్మర్ స్పోర్ట్స్‌కు ఆసక్తి గల క్రీడాకారులు గ్రామపంచాయతీ కార్యదర్శి వద్ద పేర్లు నమోదు చేసుకోవాలని ఎంపీడీవో విజయ్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 15 నుంచి 36 సంవత్సరాల వయసు కలిగిన యువకులు మే 9వ తేదీలోగా పేర్లు నమోదు చేసుకొని, మే 15 నుంచి 17వ తేదీ వరకు మండల కేంద్రంలోని పాఠశాల గ్రౌండ్‌లో వాలీబాల్, ఫుట్‌బాల్, కబడ్డీ, కోకో, అట్లాంటిక్స్ ఆటల్లో పాల్గొనాలని సూచించారు.

చెవిలో పువ్వుతో నిరసన

- 11వ రోజుకు జేపీఎస్‌ల సమ్మె.
- వినూత్న రీతుల్లో నిరసన

నవతెలంగాణ-విలేకరుల బృందం

జూనియర్ పంచాయతీ సెక్రెటరీల నిరవధిక సమ్మె సోమవారం 11వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా కార్యదర్శులు చెవిలో పువ్వులు పెట్టుకొని వినూత్న రీతుల్లో నిరసనలు తెలిపారు.

పిట్లం : మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ముందు నిర్వహిస్తున్న సమ్మెలో జూనియర్ పంచాయతీ సెక్రటరీలు ప్లకార్డులతో వినూత్న నిరసన తెలిపారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ముందు పలువురు మాట్లాడుతూ.. నాలుగు సంవత్సరాల సర్వీస్ కాలాన్ని రెగ్యులరైజ్ చేసి తమను ఆదుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో మండల జూనియర్ పంచాయతీ సెక్రెటరీలు పాల్గొన్నారు.

జేపీఎస్‌ల శాంతియుత సమ్మెకు ఆర్థికసాయం..

జుక్కల్ : మండల కేంద్రంలో జూనియర్, ఔట్‌సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శుల సమ్మెకు మద్దతు తెలుపుతూ జెడ్పీటీసీ దాదారావు పటేల్ రూ.5వేల ఆర్థిక సహాయం, కల్లాలి సర్పంచ్ కులకర్ణి రమేష్ దేశాయి రూ.5వేలు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ, కేమ్రాజ్‌కల్లాలి సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.



సదాశివనగర్ : చెవిలో పూలు పెట్టుకుని నిరసన..

చెవిలో పూలు పెట్టుకుని నిరసన..

సదాశివనగర్ : జూనియర్, ఔట్‌సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులు వినూత్న నిరసన చేపట్టారు. సమ్మె విరమిస్తేనే క్రమబద్దీకరణ చేస్తామని ప్రభుత్వం అన్న మాటలకు, ప్రభుత్వం రెగ్యులరైజేషన్ చేయకుండా హామీలు ఇస్తూ చెవిలో పూలు పెడుతుందని అన్నారు.

సమ్మెకు సర్పంచ్‌ల ఆర్థిక సహాయం..

బోధన్ : తమ ఉద్యోగాలను క్రమబ ద్ధికరించాలంటూ 11 రోజులుగా బోధన్ మండల పరిషత్ కార్యాలయం వద్ద సమ్మె చేస్తున్న జూనియర్ పంచాయతీ కార్యద ర్శుల సమ్మెకు బోధన్ సర్పంచ్‌ల ఫోరం ఆధ్వర్యంలో సంఘీభావం తెలిపి వారికి రూ.40వేలు ఆర్థికసా యం అందించారు. ఈ సంద ర్భంగా సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షులు శ్రీనివాసరావు మాట్లా డుతూ.. ప్రభుత్వం జూనియర్ పంచాయతీ కార్యదర్శులను తక్షణమే పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. గ్రామాలలో పల్లె ప్రగతి, హరితహారం లాంటి కార్యక్రమాల అమ లులో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చాలా కష్టపడ్డారని పేర్కొన్నారు. అనంతరం అక్కడే సమ్మెలో ఉన్న పంచాయతీ కారోబార్లు, పంచాయతీ సిబ్బంది చేస్తున్న సమ్మెకు సంఘీభావం తెలిపి వారికి సర్పంచ్‌ల ఫోరం ఆధ్వర్యంలో రూ.5వేలు విరాళం అందించారు. సర్పంచులు రావుబా గంగాధర్, షేక్ అమీర్, చింతం నాగయ్య, కోర్వ గంగాధర్, చీల గంగారం, సుదర్శన్, నర్సారెడ్డి, బెజ్జం వెంకటరెడ్డి, కృష్ణ ప్రసాద్, రంజనాయక్ తదితరులున్నారు.



జుక్కల్‌లో..



బోధన్ : జీపీ కార్యదర్శులకు ఆర్థికసాయం అందజేస్తున్న దృశ్యం

బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేస్తాం

- బోధన్ సర్పంచ్‌ల ఫోరం హెచ్చరిక



బోధన్ : మాట్లాడుతున్న శ్రీనివాసరావు

నవతెలంగాణ-బోధన్

ప్రభుత్వం సర్పంచ్‌ల సమస్యలు పరిష్కరించని యెడల ఈనెల 15వ తేదీన బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వానికి మూకుమ్మడిగా రాజీనామా చేస్తామని సర్పంచ్‌ల ఫోరం మండలాధ్యక్షుడు శ్రీనివాసరావు హెచ్చరించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సర్పంచ్‌ల సమావేశంలో వారు చర్చించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీ అభివృద్ధికి నిధులు లేక ఇబ్బందులు పడుతున్నామని, చేసిన అభివృద్ధి పనులకు బిల్లులు ఇప్పటికీ విడుదల కాలేదని, ఎస్టీఓలో బిల్లులు మంజూరు కాకుండా పెండింగ్‌లో ఉన్నాయని వారు తమ ఆవేదన వ్యక్తం చేశారు. కావున తెలంగాణ ప్రభుత్వం ఈనెల 15వ తేదీవరకు ఈ సమస్యలు పరిష్కరించాలని, లేనియెడల పార్టీకి మూకుమ్మడిగా రాజీనామాలు చేస్తామని ప్రకటించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి సిర్ప సుదర్శన్, సర్పంచ్‌లు నాగయ్య, షేక్ అమీర్, కుమ్మనపల్లి గంగాధర్, రాజు, రావుబా గంగాధర్, నాయకులు చీల గంగారం, సుదర్శన్, సాయిలు, నర్సారెడ్డి ఉన్నారు.

దాడి చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి



రాస్తారోకో చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-దోమకొండ

కాంగ్రెస్ నాయకుడిపై దాడి చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలోని గాంధీచౌక్ వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి అబ్రబోయిన స్వామి, యూత్ కాంగ్రెస్ నాయకుడు బాధితుడు సార్ల రాజు మాట్లాడుతూ.. దోమకొండ మండలంలోని చింతమాన్‌పల్లి గ్రామానికి చెందిన సార్ల రాజు గత కొన్ని ఏండ్లుగా బీజేపీ, బీజేవైఎం అధ్యక్షులుగా పార్టీలో కొనసాగగా.. బీజేపీ పార్టీలో అసంతృప్తి ఇష్టంలేక మాజీ మంత్రి షబ్బీర్ అలీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారని, బీజేపీ పార్టీ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరడంతో అది జీర్ణించుకోలేని బీజేపీ నియోజకవర్గ ఇన్చార్జ్ రమణారెడ్డి తన డ్రైవర్‌తో పాటు పలువురిని అనుచరులను తన ఇంటికి పంపించి దాడి చేయించినట్టు తెలిపారు. సార్ల రాజుపై దాడి చేసిన వారిపై చట్ట పరమైన కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రమేష్, గంగాధర్, శ్రీనివాస్, మధు తదితరులు పాల్గొన్నారు.

సమ్మె విరమించే ప్రసక్తే లేదు

- 15వ రోజుకు వీవోఏల సమ్మె



ఎడపల్లి : సమ్మెలో ఐకేపీ వీవోఏలు

నవతెలంగాణ-విలేకరుల బృందం

బోధన్ : ఇందిరాక్రాంతి పథంలో పనిచేస్తున్న వీవోఏల సమ్మె సోమవారం నాటికి 15వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించి ఆదుకోవాలని కోరారు. లేనియెడల సమ్మె విరమించే ప్రసక్తి లేదని హెచ్చరించారు. ఈ సమ్మెకు మండల మహిళా సమాఖ్య కార్యవర్గ సభ్యులు వారి సంఘీభావం తెలిపారు. ఈ సమ్మెలో జిల్లా అధ్యక్షులు పోశెట్టి, మండల ప్రతినిధులు రమేష్, వెంకటేష్, భూమయ్య, పంచశీల, కృష్ణవేణి, రాధిక తదితరులు పాల్గొన్నారు.

ఎడపల్లి : ఇందిరాక్రాంతి పథం ఐకేపీలో పనిచేస్తున్న వీవోఏలకు సమానపనికి సమానవేతనాన్ని ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన సమ్మెకు పలువురు మద్దతు ప్రకటించారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రమాద బీమా సౌకర్యాన్ని అమలు చేయాలని, స్త్రీనిధి నుంచి కనీసం రూ.50వేల రుణాన్ని వీవోఏలకు అత్యవసర సమయంలో అమలు చేయాలని, వీవోఏల సమస్యలను వారి డిమాండ్లను ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు.

వీవోఏల సమ్మెకు మద్దతు..

వర్ని : చందూర్, వర్ని మండలాలకు చెందిన ఐకేపీ వీవోఏల సమ్మె 15వ రోజుకు చేరడంతో గ్రామస్థాయి, మండల స్థాయి మహిళా సంఘాల అధ్యక్షులు, బుక్ కీపర్లు సోమవారం సమ్మెకు మద్దతు తెలిపారు. ప్రభుత్వం వీవోఏల సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించేలా చూడాలని కోరారు. లేనియెడల వీవోఏలకు మద్దతుగా గ్రామస్థాయి నుంచి జిల్లాస్థాయి మహిళా సంఘాల అధ్యక్షురాలు మద్దతు తెలుపుతూ సమ్మెలో వారితో పోరాటం చేస్తామని తెలిపారు.

హక చైర్మన్‌ను సన్మానించిన జిల్లా చైర్మన్లు

నవతెలంగాణ-ఆర్మూర్

హక సంస్థ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో సోమవారం జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హక ఆధ్వర్యంలో సీడ్ సప్లై చెయ్యాలని, వ్యవసాయ పరికరాలు పంపిణీ చేయాలనీ కోరారు. హక చైర్మన్ మంచి శ్రీనివాస్ రావును కలిసి శాలువా పూల బుకేతో సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా చైర్మన్ లు మునిపల్లి సాయరెడ్డి, సోమ హేమంత్ రెడ్డి, కార్తీక్ రెడ్డి, అర్గుల్ గంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



చైర్మన్‌కు సన్మానం

ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాలు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

సికింద్రాబాద్ పార్లమెంట్ ఖైరతాబాద్ నియోజకవర్గం మాసబ్ ట్యాంక్ వద్ద ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాలు పొలిట్ బ్యూరో సభ్యులు అరవింద్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమం ముఖ్యఅతిథిగా నందమూరి బాలకష్ణ , విశిష్ట అతిథిగా తెలంగాణ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ హాజరయ్యారు, అదేవిధంగా నిజామాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు దేగాం యదాగౌడ్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బాలకృష్ణ

ఘనంగా హెన్రిడునంట్ జయంతి వేడుకలు

నవతెలంగాణ-కంఠేశ్వర్

రెడ్ క్రాస్ సంస్థ వ్యవస్థాపకులు హేన్రి డునంట్ జయంతిని పురస్కరించుకొని జాతీయ రెడ్‌క్రాస్ దినోత్సవాన్ని జిల్లా రెడ్ క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో నగర కేంద్రంలోని రెడ్‌క్రాస్ మార్గ్‌లోని రెడ్ క్రాస్ భవనంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నగర మేయర్ నీతూ కిరణ్ శేఖర్ ముఖ్యఅతిథిగా హాజరై హెన్రిడునంట్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నగర మేయర్ నీతూ కిరణ్ మాట్లాడుతూ.. జిల్లా రెడ్ క్రాస్ గణనీయమైన సేవలను అందిస్తూ రాష్ట్ర స్థాయిలోనే బంగారు పతకాలు అందుకొని ఆదర్శంగా నిలిచిందన్నారు. భవిష్యత్తులో జాతీయ స్థాయిలోనూ జిల్లా కీర్తిని ఇనుమడింప చేయాలన్నారు. రెడ్ క్రాస్ సేవలు జిల్లాలో విస్తృతంగా జరుగుతున్నాయని అభినందించారు. రక్త నిధి సేవలు సైతం ఆదర్శప్రాయంగా నిలుస్తున్నాయని అన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా రెడ్ క్రాస్ సంస్థ చైర్మన్ బస్సా ఆంజనేయులు మాట్లాడుతూ.. ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవం తల సేమియా దినోత్సవం సందర్భంగా అందరికి శుభాకాంక్షలు తెలిపారు. అందరూ సమిష్టిగా సమైక్యతతో రెడ్ క్రాస్ సంస్థతో కలిసి నడవాలని ఆయన పిలుపునిచ్చారు. ముఖ్యంగా స్వచ్ఛంద సంస్థలు కలిసి నడిస్తే పూర్తి సహకారం అందిస్తామన్నారు. భవిష్యత్తులో మరింత సేవలు పెరగాలన్న నగర ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు మానవవాదులు ముందుకు వచ్చి అండగా నిలవాలన్నారు. ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవాన్ని పురస్కరించుకొని సంస్థ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తోట రాజశేఖర్ 77వ సారి రక్తదానం చేసి అందరికీ ఆదర్శంగా నిలిచారు. ఆయనకు మేయర్ నీతూ కిరణ్ ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. రాజశేఖర్ జిల్లా రెడ్‌క్రాస్‌కు ఆదర్శమన్నారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ జిల్లా కోశాధికారి కరిపే రవీందర్, నిజామాబాదు డివిజన్ చైర్మన్ డాక్టర్ శ్రీశైలం, జూనియర్ రెడ్ క్రాస్ కోఆర్డినేటర్ డాక్టర్ అబ్బపు రవీందర్, ఎంసి మెంబర్లు మురళీకష్ణ, నాగార్జున రెడ్డి, వెంకటకష్ణ, బాబా శ్రీనివాస్, మల్లెపూల శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, అరుణ్ బాబు, పోచయ్య నాగభూషణం, డాక్టర్ సూరి, విద్యుత్తు ఏఈలు డి శ్రీనివాస్ ఆర్ సుమిత, సిబ్బంది పాల్గొన్నారు.



చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రెడ్‌క్రాస్ బృందం

15 నుంచి క్రీడా పోటీలు

నవతెలంగాణ-ధర్పల్లి

రాష్ట్ర క్రీడల శాఖ ఆదేశాల మేరకు ఈసంవత్సరం సీఎం కప్ 2023, మండల స్థాయి క్రీడలు ఈనెల 15 నుండి 17 వరకు రెండురోజులు నిర్వహించనున్నామని ఎండిఓ నటరాజ్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆటల పోటీల్లో పాల్గొనేవారు 15 నుండి 36 సంవత్సరాలు కలిగిన స్త్రీ, పురుషులు అర్హులని పేర్కొన్నారు. పోటీల్లో అథ్లెటిక్స్ కబడ్డీ, ఖోకో, వాలీబాల్ క్రీడల్లో పాల్గొనే యువజన సంఘాలు , పాఠశాల, కళాశాల విద్యార్థులను పంపాలని సర్పంచులు, పాఠశాలల, కళాశాల అధ్యాపకులను కోరారు, ఎలాంటి ఎంట్రీ రుసుం లేకుండా శ్రీధర్ జూనియర్ అసిస్టెంట్ ధర్పల్లి వద్ద వివరాలు నమోదు చేసుకోవాలని కోరారు.

రాజ్యాంగాన్ని ప్రతిఒక్కరికి అందించాలి

- తహసీల్దార్‌కు వినతి



కమ్మర్‌పల్లి : తహసీల్దార్‌కు వినతినిస్తున్న నాయకులు

నవతెలంగాణ-ధర్పల్లి

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ రచించిన గొప్ప గ్రంథం రాజ్యాంగ గ్రంథం దేశంలోని ప్రతి ఒక్కరికి ఉచితంగా అందించాలని డిమాండ్ చేస్తూ సోమవారం డిఎస్పీ (ధర్మ సమాజ్ పార్టీ) ఆధ్వర్యంలో తహసీల్దార్ గంగ ప్రసాద్ కు వినతి పత్ర అందించారు. ఈసందర్భంగా డిఎస్పీ పార్టీ మండల అధ్యక్షుడు ప్రశాంత్ మహారాజ్ మాట్లాడుతూ దేశంలో 140 కోట్ల జనాభా ఉన్నప్పటికీ నేటికీ కొన్ని కోట్ల ప్రజానీకానికి భారత రాజ్యాంగం పట్ల అవగాహనా లేక పోవడం బాధాకరమని అన్నారు. దీనంతటికి కారణం మన పాలకులేనని విమర్శించారు. అందుకే దేశంలోని ప్రతి పౌరునికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉచితంగా రాజ్యాంగాన్ని అందించాలని డిమాండ్ చేస్తుందని అన్నారు. లేకుంటే డీఎస్పీ పార్టీ ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టేందుకు కార్యాచరణ రూపొందిస్తుందని అన్నారు. కార్యక్రమంలో కిషన్ మహారాజ్, మహిపాల్, శ్రీనివాస్, నర్సయ్య, గోపి, అశోక్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: భారత రాజ్యాంగ గ్రంథాన్ని ప్రతి పౌరునికి ప్రభుత్వమే ఉచితంగా పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ ధర్మ సమాజ్ పార్టీ కమ్మర్‌పల్లి మండలకమిటీ ఆధ్వర్యంలో తహసీల్దార్ సురేష్‌కు విజ్ఞాపన పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ధర్మ సమాజ్ పార్టీ మండల అధ్యక్షుడు కైలాష్ మహారాజ్ మాట్లాడుతూ.. ఈ దేశాన్ని నడిపిస్తున్నది భారత రాజ్యాంగం అలాంటి గ్రంథం పట్ల నూటికి 90 శాతం ప్రజలకు అవగాహన లేకనే పార్లమెంటరీ, ప్రజాస్వామ్యం విఫలమై పోతుందన్నారు. భారత రాజ్యాంగ గ్రంథం విశిష్టత ప్రతి పౌరుడికి తెలిసేలా ప్రభుత్వాలే ఉచితంగా పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మోర్తాడ్ మండల అధ్యక్షుడు ఉమేష్ మహరాజ్, నాయకులు శంకర్, ఆనంద్, బాబూరావు, మోహన్, సాగర్ బాలు, తదితరులు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి: భారత రాజ్యాంగ గ్రంథాన్ని ప్రతి పౌరునికి ప్రభుత్వమే ఉచితంగా పంపిణీ చేయాలని ధర్మ సమాజ్ పార్టీ- డిఎస్‌పి మండల కమిటీ ఆధ్వర్యంలో మండల ఇంచార్జి తహసిల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ధర్మ సమాజ్ పార్టీబిడి.ఎస్.పి మండల ప్రచార కమిటీ అధ్యక్షులు మహేష్ మహారాజ్ మాట్లాడుతూ.. ప్రభుత్వాలు స్పందించికపోతే ప్రతి పౌరుడికి రాజ్యాంగ గ్రంథం అందించే వరకు నిరంతర పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి రవి, కోశాధికారి దిలీప్, మీడియా ఇంచార్జి రవి, మండల నాయకులు కిరణ్, భూమన్న, సంతోష్(గంగపుత్ర), రణదీప్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

నవతెలంగాణ-రామారెడ్డి

మండల కేంద్రానికి చెందిన ఏనుగుర్తి రాములు మృతి చెందగా బాధిత కుటుంబం ఆర్థిక ఇబ్బందులు ఉందని తెలుసుకొని నారెడ్డి స్వచ్ఛంద సంస్థ ద్వారా, స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు, జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ నారెడ్డి మోహన్‌రెడ్డి స్పందించి రూ.3వేల ఆర్థిక సహాయాన్ని బాధిత కుటుంబానికి సోమవారం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు వడ్ల లక్ష్మీరాజం, యూత్ మండలాధ్యక్షులు చింతకుంట కిషన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టే చర్యలు మానుకోవాలి

- ఎంపీపీ సంగెం శ్రీనివాస్

నవతెలంగాణ-నవీపేట్

రాష్ట్ర ప్రభుత్వాన్ని ఉద్దేశపూర్వకంగా ఇరకాటంలో పెట్టే చర్యలను బీజేపీ నాయకులు మోహన్ రెడ్డి మానుకోవాలని ఎంపీపీ సంగెం శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలోని బట్టోడు భాగ్‌లో తడిసిన ధాన్యాన్ని పరిశీలించి అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టేందుకే రైస్‌మిల్ అసోసియేషన్ ద్వారా బిజెపి నాయకులు మోహన్ రెడ్డి తడిసిన ధాన్యాన్ని తీసుకోకుండా చర్యలు చేపట్టడం సబబు కాదని అన్నారు. సీఎం కేసీఆర్ తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని ప్రకటించినప్పటికీ రైస్ మిల్లర్స్ జిల్లాలో తడిసిన ధాన్యాన్ని కొనబోమని చెప్పడం రైతు వ్యతిరేక చర్య అని బిఆర్ఎస్ మండల కన్వీనర్ నర్సింగ్ రావు అన్నారు. రైతులకు మనోధైర్యాన్ని కల్పించాలనే ఉద్దేశంతోనే ఎమ్మెల్యే ఆదేశాల మేరకు రైతుల వద్దకు వచ్చి భరోసా ఇచ్చేందుకు ప్రయత్నిస్తున్నామని, రైతులు అధైర్య పడవద్దని బిఆర్ఎస్ నాయకులు బుచ్చన్న అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు నవీన్ రాజ్, అల్లం రమేష్ మరియు రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ

ఆదివాసీ నాయకపోడు భవనానికి రూ.25 లక్షలు మంజూరు

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని అంకాపూర్ గ్రామంలో తన నివాసంలో ఎమ్మెల్యే ఆశన్న గారి జీవన్ రెడ్డి ఆదివాసి నాయక పోడు సంఘం జిల్లా నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నూతనంగా ఎన్నికైన జిల్లా అధ్యక్షుడు గాండ్లా రామచందర్ ఎమ్మెల్యేకు ఆర్మూర్ ఆర్మూర్ నియోజకవర్గంలో ఉన్న ఆదివాసి నాయక పోడు కులస్తుల సమస్యలు వివరించారు. ఆర్మూర్ ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి మున్సిపల్ పరిధిలో సంఘ భవనంకోసం 500 గజాల ప్లాటుతోపాటు భవనం నిర్మాణానికి 25 లక్షల రూపాయల నిధులను మంజూరు చేశారు. నియోజకవర్గంలో ఉన్న నిరుపేద ఇల్లులేని ఆదివాసి నాయకపోడు కులస్తులకు ఇల్లు నిర్మించడం గురించి ప్రభుత్వం నుండి మూడు లక్షల రూపాయలు మంజూరు చేస్తానని అన్నారు. మాక్లూర్ మండలం కల్లెడ గ్రామంలో కల్లేడ విద్యా కమిటీ చైర్మన్ సురంగల విజయ్ అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకుంటానని, వారి పిల్లలు చదువుకోటానికి హాస్టల్లో చేర్పించి ఉన్నత చదువులు చదివిస్తానని, వారికి ఉండటానికి ఒక ప్లాటు, ఇల్లు నిర్మించుకోవడానికి మూడు లక్షల రూపాయలు మంజూరు చేస్తానని అన్నారు. కార్యక్రమంలో నూతనంగా ఎన్నికైన జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లూరు సాయన్న, జిల్లా కోశాధికారి శ్యానం పవన్, వర్కింగ్ ప్రెసిడెంట్ లొలం గంగాధర్, జిల్లా సాంస్కతిక కార్యదర్శి పెర్కిట్ మూఢ అశోక్ మాజీ మున్సిపల్ కౌన్సిలర్ జిల్లా మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ పూల నర్సయ్య నిజామాబాద్ మండలం వైస్ ప్రెసిడెంట్ అన్నం సాయిలు, మాజీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ధాత్రీ అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

గౌడ కుటుంబాలకు భరోసా.. గీతన్న బీమా

- కేసీఆర్, ప్రశాంత్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్ చిత్రపటాలకు పాలాభిషేకం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

గీత కార్మికుల కోసం రైతు బీమా తరహాలో ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించిన గీతన్న బీమా గౌడ కుటుంబాలకు ఎంతో భరోసానిస్తుందని గౌడ సంఘం మండల అధ్యక్షుడు మల్యాల సుభాష్ గౌడ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని గౌడ సంఘ భవనంలో ప్రభుత్వం గీతన్న బీమా పథకాన్ని ప్రవేశపెట్టడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి కేసీఆర్, రాష్ట్ర రోడ్ల భవనాలు, గహ నిర్మాణ, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి, ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో రైతుబంధు సమితి మండల కోఆర్డినేటర్ బద్దం రాజేశ్వర్, బిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు చింత గణేష్, గౌడ సంఘం సభ్యులు దూలూరు కిషన్ గౌడ్, మామిడిపల్లి రామ్ గౌడ్, మామిడిపల్లి రాజేశం గౌడ్, మల్యాల దశ గౌడ్, సల్లూరి బాలా గౌడ్, కోడ భూమేశ్వర్, కోటగిరి రాజగౌడ్ పాల్గొన్నారు.



చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న గౌడ కులస్తులు

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోండి

నవతెలంగాణ-సిరికొండ

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 3వ విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ బొబ్బిలి రాజు కోరారు. సోమవారం చిన్నవాల్గోట్ గ్రామంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకునే స్తోమతలేని పేదప్రజలు ఉన్నారని, ఇలాంటి పేదవారికి ఉచితంగా వైద్యంఅందేలా ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ పథకాన్ని ప్రవేశ పెట్టారని తెలిపారు. ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ముఖ్యమంత్రికి రూరల్ ఎమ్మెల్యే, టీఎస్ ఆర్టీసీ చైర్మెన్ బాజిరెడ్డి గోవర్ధన్‌కు, బాజిరెడ్డి జగన్‌కు ప్రత్యేక కతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ లక్ష్మీపతి, సొసైటీ చెర్మెన్ మైలారం గంగారెడ్డి, ఉప సర్పంచ్ మోహన్ రెడ్డి, మండల వైద్య సిబ్బంది, గ్రామ ప్రజలు, కారోబార్ సాయిరాం గౌడ్,తదితరులు పాల్గొన్నారు.



కంటి వెలుగు శిబిరం ప్రారంభిస్తున్న సర్పంచ్

రైస్ మిల్లర్స్ రైతులను బ్లాక్ మెయిల్ చేయొద్దు : సీపీఐ

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

రైస్ మిల్లర్స్ రైతులను బ్లాక్ మెయిల్ చేయొద్దు అని సిపిఐ జిల్లా కార్యదర్శి సోమవారం పి.సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. అకాల వర్షాల వల్ల నిజామాబాద్ జిల్లాలో వరి పంట చేతికొచ్చే సమయంలో, పంట కోయడానికి ప్రకతి సహకరించక లేదని పేర్కొన్నారు.

వడ్లు కోసే యంత్రాల ధరలు పెంచినప్పటికీ, సగం వడ్లు నేల పాలైన సరే కోత కోయించిన, వచ్చిన వడ్లను ఆరబెట్టి ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు తీసుకెళ్తే మ్యాచర్ రావడం లేదని, రైస్ మిల్లర్లు తీసుకోరని రైతులను వెనక్కు పంపుతున్నారని తెలిపారు. పౌరసరఫరాలశాఖ అధికారులు, రైస్ మిల్లర్ల సమన్వయ లోపం ఒకపక్క, రైస్ మిల్లు యజమానులు బిజెపి, బిఆర్ఎస్ పార్టీల్లో ఉండి ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టి సీఎంఆర్ ద్వారా ప్రభుత్వానికి ఇచ్చే బియ్యంలో లబ్ది పొందడానికి చూస్తూ, రైతుని ఇబ్బందికి గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వడ్లు తీసుకునేదే లేదని రైస్ మిల్లర్ యజమానులు రైతులను బ్లాక్ మెయిల్ చేస్తున్నారని కలెక్టర్ చొరవచూపి ప్రతి వడ్ల గింజ కొనుగోలు జరిగేలా చర్యలు తీసుకొని, రైతుకు న్యాయం చేయాలని కోరారు.

కండ్లకు గంతలు కట్టుకొని నిరసన

నవతెలంగాణ-ధర్పల్లి

తమ సమస్యలు ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ పంచాయతీ కార్మికులు చేస్తున్న సమ్మె సోమవారం నాటికి నాలుగవ రోజుకు చేరింది, ఈసందర్భంగా వారు కళ్ళకు గంతలు కట్టుకొని ప్రభుత్వానికి తమ నిరసన వెలిబుచ్చారు. పెరిగిన నిత్యావసరాలతో కుటుంబ పోషణ కష్టంగా మారిందని, చాలీచాలని వేతనాలతో తాము తమ జీవితాలు గడిపేదెలా అంటూ పంచాయతీ కార్మికు వాపోతున్నారు, తోటి కార్మికుడు భలేరావ్ తానూర్ మండలంలోని బోరిగాం గ్రామంలోని పంచాయతీ కార్యాలయంలో విద్యుత్ పనులు చేస్తూ విద్యుత్ షాక్తో మతిచెందగా మౌనం పాంటించారు. కార్యక్రమంలో మండలంలోని అన్ని గ్రామాల పంచాయతీ అన్ని విభాగాల కార్మి కులు పాల్గొన్నారు,



నిరసన వ్యక్తం చేస్తున్న పంచాయతీ సిబ్బంది

కమ్మర్ పల్లి: మం డల కేంద్రంలోని 63 నంబర్ జాతీయ రహదారి పక్కన హాస కొత్తూర్ చౌరస్తా వద్ద తెలంగాణ గ్రామ పంచాయతీ కారోబార్స్ అండ్ సిబ్బంది యూనియన్ ఆధ్వర్యంలో శిబిరం ఏర్పాటు చేసుకొని గ్రామ పంచాయతీ సిబ్బంది సమ్మెను కొనసాగిస్తున్నారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కారోబార్స్ అండ్ సిబ్బంది యూనియన్ మండల అధ్యక్షులు తలారి రాజేశ్వర్ మాట్లాడుతూ ప్రభుత్వం, ముఖ్యమంత్రి తక్షణమే స్పందించి గ్రామ పంచాయతీ సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పెండిం గ్ వేతనాలను వెంటనే చెల్లించాలన్నారు. పంచాయతీలో పని చేస్తున్న సిబ్బంది కి నేరుగా ప్రభుత్వమే సిబ్బందికి అకౌంట్లో వేయాలన్నారు. ఉద్యోగ భద్రత కల్పించి, బీమా సౌకర్యం కల్పించాలన్నారు. కారోబార్, బిల్ కలెక్టర్లను మల్టీప ర్పస్ విధానం నుండి మినహాయించి పంచాయతీ కార్యదర్శికి అసిస్టెంట్ పంచా యతీ కార్యదర్శులుగా ప్రత్యేక హోదా కల్పించి రూ.21, 500 వేతనం ఇవ్వా లని డిమాండ్ చేశారు. 51 జీవో సవరించి కేటగిరీల వారిగా హోదాలు కల్పిం చి కనీస వేతనం రూ.15500 ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో మండల గౌరవ అధ్యక్షులు వెంకటరమణ, జిల్లా కార్యవర్గ సభ్యులు బాజే సాహెబ్, కౌడ పోచ య్య మండల సపాయిలు, ఎలక్ట్రీషన్, పంపు ఆపరేటర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఉండొద్దు

- సొసైటీ చైర్మన్ నల్లవెల్లి కపిల్‌రెడ్డి



మాట్లాడుతున్న సొసైటీ చైర్మెన్

నవతెలంగాణ-తాడ్వాయి

రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఉండకూడదని సొసైటీ చైర్మన్ నల్లవెల్లి కపిల్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని సొసైటీ కార్యాలయంలో సమీక్ష సమావేశాన్ని కపిల్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. సొసైటీ పరిధిలో ఏర్పాటు చేయబోయే మక్కల, ధాన్యం కొనుగోలు సెంటర్ల గురించి మండల ఏవో, ఏఈవోలు, ఆయా గ్రామాల సెంటర్ ఇన్చార్జిలతో సమావేశం నిర్వహించారు. దీనిలో భాగంగా సొసైటీ చైర్మన్ కపిల్‌రెడ్డి మాట్లాడుతూ.. గ్రామాల్లో ఉన్న ఇంచార్జిలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ రైతులకు ఇబ్బంది కలగకుండా కొనుగోలు త్వరితగతిన చేసేందుకు సహకరించాలని, అలాగే ఎమ్మెల్యే సూచనల మేరకు మండలంలో పంట నష్టాన్ని త్వరగా అంచనా వేయాలని ఏవోకు సూచించారు. కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్ ధర్మారెడ్డి, డైరెక్టర్లు నరసింహులు, నర్సింలు, గణేష్, బాబురావు, ఆకిటి చంద్రకళ, సొసైటీ సిబ్బంది, మానిటర్ ఆఫీసర్ పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ పాలకవర్గ సమావేశం



సమావేశంలో పాల్గొన్న పాలకవర్గం

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ బాడీ సమావేశం మార్కెట్ కార్యాలయంలో చైర్మన్ కాశి నారాయణ అధ్యక్షతన సోమవారం సమావేశం నిర్వహించారు. గత మూడు నెలల ఆదాయ వ్యయాలను పరిశీలించి ఈ సమావేశం సందర్భంగా పలు తీర్మానాలకు ఆమోదం తెలిపారు. మండలంలోని మోతె గ్రామంలో మొబైల్ చెక్ పోస్ట్ ఏర్పాటు చేయటం, కార్యాలయంలో నూతన ఫర్నీచర్ కొనుగోలు చేయడంపై కమిటీ సభ్యులందరూ తీర్మానించినట్టు తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ సిద్ధిరాంరెడ్డి, ఏడీఏ రత్నం, మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ, సొసైటీ చైర్మన్ ఎగుల నర్సింలు, డైరెక్టర్‌లు కిష్టయ్య హనుమంత్‌రెడ్డి గోల విఠల్, మల్లారెడ్డి, హరి నారాయణ, వాహబోద్దీన్, సీఈఓ ధూమ్డా తదితరులు పాల్గొన్నారు.

దామరంచలో తాగునీటిపై నిలదీత



నీటి సమస్యపై మాట్లాడుతున్న గ్రామస్తులు

నవతెలంగాణ-నసురుల్లాబాద్

తెలంగాణలో ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మిషన్ భగీరథ తాగునీటి పథకం దేశానికి దిక్సూచిలా మారిందని అధికారులు, అటూ మంత్రులు చెప్తుంటే ఓ గ్రామ సర్పంచ్ ఆ పథకం అంతగా బాగాలేదని, ఊరికి ఒక ట్యాంక్ నిర్మిస్తే సరిపోయేదని అసహనం వ్యక్తం చేశాడు. కామారెడ్డి జిల్లా బీర్కూరు మండలం దామరంచ గ్రామంలో గత మూడు నెలల నుంచి ఓ వీధిలో తాగునీరు లేక ప్రజలు ఇబ్బందులకు గురికాగా.. సోమవారం ఆ బోయివాడకు వచ్చిన గ్రామపంచాయతీ సిబ్బందిని గ్రామస్తులు నిలదీశారు. గత ఐదారు మాసాల నుంచి బోయి వాడకు త్రాగునీరు లేక ఇతర వాడాల నుంచి తాగునీరు తీసుకోని రావాల్సి వస్తుందన్నారు. ఎన్నిసార్లు చెప్పినా సర్పంచ్ పట్టించుకోవడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. తాగునీటి ట్యాంకు నుంచి 100 అడుగుల దూరం లోనే 10 లీకేజీలు ఉండడంతో తాగునీరు అంతా వృథాగా పోతుందని, మరో వాడలో వచ్చిన కొద్దిపాటి కోసం బారులు తీరాల్సి వస్తుందన్నారు. ఈ సందర్భంగా సత్యవ్వ, గంగారం, దశరథ్ మాట్లాడుతూ.. గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని సర్పంచ్‌కు గ్రామపంచాయతీ సిబ్బందికి పలుమార్లు చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు.

మండల కేంద్రంలో క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

నవతెలంగాణ-గాంధారి

మండల కేంద్రంలో హరాలే బల్వంత్‌రావు జ్ఞాపకార్థం హరాలే సాహెబ్‌రావు, చక్రధర్‌రావు ఆధ్వర్యంలో తలపెట్టిన క్రికెట్ టోర్నమెంట్‌ను గాంధారి సర్పంచ్ మమ్మాయి సంజీవ్ యాదవ్, సొసైటీ చైర్మెన్ సాయికుమార్ సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్గనైజర్లు సాజన్ రాజ్, కళ్యాణ్, జాదవ్, సందీప్, శిందే తదితరులు పాల్గొన్నారు.

యువ సంఘర్షణ సభకు తరలిన కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-గాంధారి

మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యువ సంఘర్షణ సభకు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. సభకు తరలిన వారిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సంగెంరాజు, బానావత్ రాజు, శ్రీను, సుభాష్, శేఖర్, సంతోష్, శ్రీనివాస్, రమేష్, గోపాల్, అనిల్, సాజిద్, తదితరులున్నారు.



తరలివెళ్తున్న నాయకులు